



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 245 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 26-12-2025 పేజీలు-8 | వెల: రూ. 5.00

# కర్నాటకలో ఘోర బస్సు ప్రమాదం




## టూరిస్ట్ బస్సును ఢీకొన్న కంటెయినర్ లారీ

- ప్రమాద సమయంలో బస్సులో 32 మంది ప్రయాణికులు
- క్షతగాత్రులకు ఆస్పత్రుల్లో చికిత్స
- రాష్ట్రపతి , ప్రధాని మోడీ సంతాపం
- పీఎం రిలీఫ్ ఫండ్ కింద మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేల చొప్పున నష్టపరిహారం

**మంటలు చెలరేగడంతో 17మంది బుగ్గి**

**బెంగళూరు, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కర్నాటకలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును లారీ ఢీ కొట్టడంతో బస్సులలో మంటలు చెలరేగి 17 మంది సజీవ దహనమయ్యారు. మరో మరో 13 మంది గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన చిత్రదుర్గ జిల్లా జవరగుండనహళ్లి శివారులో తెల్లవారు 3 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. బెంగళూరు నుంచి గోకర్ణం వెళ్తున్న బస్సును లారీ ఢీ కొట్టింది. లారీ డ్రైవర్ సహా 17 మంది మృత్యువాత పడ్డారు. -మిగతా 2 లో








# తెలంగాణ బీజేపీ మరో కీలక నిర్ణయం

- నీటి ప్రాజెక్టులపై అధ్యయనం కోసం ప్రత్యేక కమిటీ
- ప్రాజెక్టులను సందర్శించనున్న కమిటీ సభ్యులు
- అసెంబ్లీలో నీటి కేటాయింపులపై చర్చకు సిద్ధమని ప్రకటన



**హైదరాబాద్,**
తెలంగాణ బీజేపీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో నీటి ప్రాజెక్టులపై అధ్యయనం చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక కమిటీ వేసి ప్రాజెక్టులను సందర్శించనున్నారు టీబీజేపీ నేతలు. తెలంగాణ అసెంబ్లీలో నీటి కేటాయింపులపై చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కేంద్ర ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై కమలం పార్టీ నేతలు షాకింగ్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరోసారి సెంటిమెంట్ రాజకీయాలు -మిగతా 2 లో



# ఒడిషాలో భారీ ఎన్‌కౌంటర్

- మావోయిస్ట్ కీలక నేత గణేశ్ హతం
- మొత్తం నలుగురు మృతి చెందినట్లు వెల్లడి

**భువనేశ్వర్,**
ఒడిశాలోని కందమాల్ జిల్లా గుమ్మా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావోయిస్టు కీలక నేత, కేంద్ర కమిటీ సభ్యుడు పాకా హనుమంతు అలియాస్ గణెశ్ ఉయికే ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆయనపై రూ.1.10 కోట్ల రివార్డు కూడా ఉందని తెలిపారు.హనుమంతు స్వస్థలం తెలంగాణలోని నల్గొండ జిల్లా చండూరు మండలం పు÷-లలెంల గ్రామం అని అధికారులు తెలిపారు. మరోవైపు ఘటనాస్థలిలో ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మావోయిస్టుల కోసం గాలింపు కొనసాగుతోంది. పాక చంద్రయ్య, పాపమ్మ దంపతుల ఆరుగురు సంతానంలో గణెశ్ మొదటివారు. ఆయన 1961లో జన్మించారు. హనుమంతుకు ముగ్గురు చెలెళ్లు, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. చండూరులో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ నల్గొండలో చేస్తూ రాడికల్ యూనియన్‌లో పనిచేశారు. 45 ఏళ్ల క్రితం ఏచూరి శ్రీనివాస్ హత్యలో ఆయన కీలకపాత్ర పోషించారు. అనంతరం అజ్ఞాతంలోకి వెళ్లి నక్సలైట్ ఉద్యమంలో చేరారు. అప్పటినుంచి ఆయన ఇంటివైపు చూడలేదు. ఆయన అమ్మ, నాన్న చనిపోయినప్పుడు కూడా రాలేదు. మండల కమిటీ నుంచి జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి నేతగా ఎదిగి మూడు రాష్ట్రాలకు కేంద్ర కమిటీ సభ్యుడిగా పనిచేశారు.

-మిగతా 2 లో

# తెలుగు రాష్ట్రాల్లో క్రిస్మస్ శోభ

## మెదక్ చర్చికి వేలాదిగా భక్తుల రాక

- చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు
- హైదరాబాద్ చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు
- విజయవాడలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు
- పులివెందుల చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న జగన్, కుటుంబ సభ్యులు



**హైదరాబాద్/విజయవాడ,డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
క్రిస్మస్ వేడుకలను తెలుగు రాష్ట్రాల్లోని క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా క్రిస్మస్ వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. పలు చర్చిల్లో క్రిస్మస్ ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో మొదలయ్యాయి. ఏసు క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని చర్చి పరిసర ప్రాంతమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది. క్రిస్మస్ వేడుకల ప్రారంభ సూచకంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. -మిగతా 2 లో

# లక్నో గోమతీ నదీ తీరంలో ప్రేరణాస్థల్ ప్రారంభం

- జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ
- 370 రద్దుతో కాశ్మీర్‌లో భారత రాజ్యాంగం అమలు
- గతంలో ఒకే కుటుంబం పేరుతో పథకాలు అమలు



**లక్నో**
ఆర్టికల్ 370 రద్దుతో శ్యామ్‌ప్రసాద్ కల సాకారం చేశామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. జమ్మూకాశ్మీర్‌లో భారత రాజ్యాంగం అమలు చేశామని చెప్పారు. గురువారం ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి కార్యక్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గోమతీ నది ఒడ్డున నిర్మించిన రాష్ట్ర ప్రేరణా స్థల్‌ను జాతికి అంకితం చేశారు. అనంతరం బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ.. 'కోట్లాదిమందిని పేదరికం నుంచి విముక్తి చేశాం అన్నారు. గతంలో ఒకే కుటుంబం పేరుతో పథకాలు అమలుచేశారు. వాజ్‌పేయి హయాంలోనే గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి -మిగతా 2 లో



# ముగిసిన పోలీసు కస్టడీ

- ఇతర నిందితులతో కలిపి ప్రభాకర్‌రావును విచారించిన సిట్ అధికారులు
- పెన్‌డ్రైవ్ నుంచే ఆధారాలు సేకరించిన సిట్
- ఫోన్ ట్యాపింగ్ వెనుక బీఆర్ఎస్ రాజకీయ ప్రముఖుల పాత్రను గుర్తించిన అధికారులు

**హైదరాబాద్ డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం గురువారం కీలక దశకు చేరుకున్నది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును 14 రోజుల పాటు విచారించిన సిట్ అధికారులు అనేక కీలక ఆధారాలను సేకరించారు. గురువారం చివరి రోజు కాగా ఆయనతో పాటు ఈ కేసులో ఇప్పటికే అరెస్టు అయిన బెయిల్‌పై ఉన్న ఎస్ఐబీ డీఎస్పీ ప్రవీణ్‌రావు, నగర్ టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతయ్య, ఒక మీడియా ఛానల్ యజమాని శ్రవణ్‌కుమార్‌లను కలిపి జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయంలో అధికారులు 10 గంటలకుపైగా విచారించారు. అంతకు ముందు ఫోన్ ట్యాపింగ్ జరిపే విషయంపై ప్రభాకర్‌రావు తనకు -మిగతా 2 లో

# బంగ్లాదేశ్‌లో హిందువులపై ఆగని దాడులు

- మరో హిందు యువకుడి దారుణ హత్య



**ఢాకా**
బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయి. హిందూ మైనారిటీలే లక్ష్యంగా దాడులు కొనసాగుతున్నాయి. దీపూ చంద్ర దాస్ ఉదంతం మరవకముందే మరో హిందూ వ్యక్తిని గ్రామస్థులు కొట్టి చంపిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. రాజ్‌బరి జిల్లాలో బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుందని స్థానిక మీడియా పేర్కొంది. డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ.. గ్రామస్థులు అతడిపై దాడికి పాల్పడినట్లు స్థానిక పోలీసులు పేర్కొన్నారు. రాజ్‌బర్ జిల్లా పంగ్షా సర్కిల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అమృత్ మొండల్ (29) అలియాస్ సామ్రాట్‌పై బుధవారం రాత్రి గ్రామస్థులు దాడి చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలికి చేరుకున్న సామ్రాట్‌ను స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ

-మిగతా 2 లో

# వేలకోట్లు సంపాదనలో ఓ ఇద్దరు మంత్రులు

## ఆ ఇద్దరు అవినీతి కేసుల్లో జైలుకు వెళ్లక తప్పదు



- కొంతమంది మంత్రులు భూ దందాలతో సంపాదన
- దీనిని తామే ఎప్పటికైనా బయటపెడతాం
- సీఎంగా రేవంత్ భాష పద్ధతిగా లేదు
- కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు

**హైదరాబాద్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రంలో ఇద్దరు మంత్రులు వేల కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు . వారిపై ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థల నిఘా ఉందన్నారు. ఎప్పటికైనా ఆ ఇద్దరు రాష్ట్రమంత్రులు జైలుకెళ్లడం ఖాయమని సంచలన కామెంట్స్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై కేంద్ర ప్రభుత్వం వద్ద అధారాలు ఉన్నాయన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొంతమంది మంత్రులు -మిగతా 2 లో

# కే-4 బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతం

## 3,500 కి.మీ. లక్ష్యాన్ని ఛేదించే సామర్థ్యం



2 లో

# కర్నాటకలో ఘోర బస్సు ప్రమాదం

మొదటి తరువాయి

ప్రమాద సమయంలో బస్సులో 29 మంది ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. బెంగళూరు నుంచి గోకర్ణ వెళ్తున్న సీబర్డ్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును కంటెయినర్ లారీ ఢీకొట్టింది. లారీ.. డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టడంతో బస్సులో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 17 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. చిత్రదుర్గ జిల్లాలోని జాతీయ రహదారి-48పై గోర్లత్తు క్రాస్ వద్ద గురువారం వేకువజామున 2.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో బస్సులో 32 మంది ప్రయాణికులు ఉన్నారు. చిత్రదుర్గ, తుమకూరు జిల్లాల పరిధిలోని అధికార యంత్రాంగం ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి అతివేగం, పొగమంచు కారణమని భావిస్తున్నారు. బస్సుతో పాటు కంటెయినర్ లారీకి కూడా మంటలు వ్యాపించాయి. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్, కో డ్రైవర్ అందులోంచి దూకి తప్పించుకున్నారు. మరికొందరు ప్రయాణికులు అద్దాలను పగులగొట్టి ప్రాణాలు కాపాడుకున్నారు. వారిలో గగన, రక్షిత అనే యువతులు ఉన్నారు. తమ స్నేహితురాలు రష్మి కనిపించడం లేదని వారు కన్నీరుమున్నీరయ్యారు. ప్రయాణికుల్లో కొంతమందికి గాయాలు కావడంతో వారిని సిరా, హిరాయూరు ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రయాణికుల్లో కొందరి పేర్లను అధికారులు గుర్తించారు. ఆ వివరాల ప్రకారం.. బస్సులో మంజునాథ్, సంధ్య, శశాంక్, దిలీప్, ప్రీతీశ్వరన్, వి బిందు, కె కవిత, అనిరుధ్ బెనర్జీ, అమృత, కల్పన, ప్రజాపతి, ఎం శశికాంత్, విజయ్ భండారీ, నవ్య, అభిషేక్, హెచ్.కిరణ్‌పాల్, ఎం.కీర్తన్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పీఎం రిలీఫ్ ఫండ్ కింద మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేల చొప్పున నష్టపరిహారం అందించనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది.

# తెలుగు రాష్ట్రాల్లో క్రిస్మస్ శోభ

మొదటి తరువాయి

ఈ సందర్భంగా చర్చి చుట్టూ శిలువ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. శిలువను ముందు ఉంచి క్రైస్తవులు ప్రార్థనా గీతాలు ఆలపిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ ఊరేగింపు సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని చర్చి ప్రాంగణాలు ఆధ్యాత్మిక సందేశాలతో మార్మోగాయి. 'శాంతి, ప్రేమ, సోదరభావం' అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఈ కార్యక్రమం సాగింది. క్రిస్మస్ వేడుకల ప్రారంభ ఆరాధనకు తెలుగు రాష్ట్రాల్లోని పలు చర్చిలకు క్రైస్తవులు భారీగా తరలివచ్చారు. పులివెందుల చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో వైఎస్ జగన్ తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సతీమణి భారతి, తల్లి విజయమ్మ ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు. అలాగే మెదక్ చర్చిలో ఏటా ప్రత్యేక ప్రార్థనలు జరుగతాయి. గురువారం ఉదయం నిర్వహించిన మొదటి ఆరాధనకు చర్చి ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. చర్చి ప్రాంగణమంతా కిక్కిరిసి పోవడంతో బయట ప్రాంగణంలో కూడా భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇందుకు అనుగుణంగా చర్చిల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. చర్చి ప్రాంగణాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అద్భుతంగా అలంకరించారు. చర్చి ప్రధాన ద్వారాలను విద్యుత్ కాంతులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చర్చిల ప్రాంగణాలు విద్యుత్ దీపాలతో మెరిసిపోతూ భక్తులను ఆకట్టుకున్నాయి. మెదక్‌లోని ప్రసిద్ధ సీఎస్ఐ చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. చర్చి చుట్టూ శిలువ ఊరేగింపు, ప్రత్యేక ప్రార్థనలతో వేడుకలు ఆరంభించారు. మొదటి ఆరాధనకు భక్తులు భారీగా పాల్గొన్నారు. దైవ సందేశాన్ని ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ రూబిన్ మార్క్ వినిపించారు. ఆయన ప్రసంగంలో



ఏసు క్రీస్తు జన్మ వెనుక ఉన్న అసలు సందేశాన్ని వివరించారు. ప్రేమ, క్షమ, త్యాగం, మానవత్వం వంటి విలువలు ఈ ప్రపంచానికి ఎంత అవసరమో ఆయన తన ఉపన్యాసంలో స్పష్టంగా చెప్పారు. సమాజంలో పెరుగుతున్న ద్వేషం, అసహనం మధ్య క్రిస్మస్ పండుగ మనకు శాంతి మార్గాన్ని చూపుతుందని ఆయన పేర్కొన్నారు. ఇకపోతే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేడుకలు వైభవంగా సాగాయి. విజయవాడ గుణదల మేరీమాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ రంగు రంగుల విద్యుత్ కాంతులతో చర్చి ప్రాంగణం శోభాయమానంగా ఉంది. క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవులు భారీగా తరలివచ్చారు. చర్చిలన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించి, ప్రత్యేక ప్రార్థనలతో సందడిగా మారాయి. ఈ వేడుకలు జిల్లాలో శాంతి, సంతోష వాతావరణాన్ని తీసుకువస్తాయని క్రైస్తవులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. చర్చి లోపల కూడా ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ఏసు క్రీస్తు జన్మ ఘట్టాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక ఏర్పాటు చేశారు. పండుగ వాతావరణంలో పిల్లల సందడి చర్చికి మరింత శోభను తీసుకువచ్చింది. పేదలకు ఆహార పంపిణీ, అవసరమైన వారికి సహాయం వంటి సేవా కార్యక్రమాలను కూడా చర్చి ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. సికింద్రాబాద్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. భారీగా క్రైస్తవులు తరలి రావడంతో భద్రతా ఏర్పాట్లను కూడా కట్టుదిట్టం చేశారు. చర్చి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్వచ్ఛంద సేవకులు సహాయం అందించారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. సిటీలోని పలు చారిత్రాత్మక చర్చిలలో క్రిస్టియన్స్ ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. క్రైస్తవుల రాకతో మియపూర్ కల్వరి టెంపుల్ కిటకిటలాడింది. కల్వరి టెంపుల్‌లో ఈ ఒక్కరోజే 5 లక్షల మందికి పైగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. సికింద్రాబాద్, అబిడ్స్‌లోని చారిత్రాత్మక చర్చిలలో తెల్లవారుజాము నుంచే క్రిస్మస్ సందడి నెలకొంది. మంచిర్యాల జిల్లాలోని మందమర్రి, రామకృష్ణపూర్ సీఎస్ఐ, సీయోను, పెంతేకొస్తు చర్చిలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రైస్తవులందరికీ క్రిస్టమస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# వేలకోట్లు సంపాదనలో ఓ ఇద్దరు మంత్రులు

మొదటి తరువాయి

వేల కోట్ల భూములను అమ్ముకుంటున్నారని.. దీన్ని ఎప్పటికైనా బయటపెడతామని హెచ్చరించారు. ఇద్దరు లేదా ముగ్గురు మంత్రులు జైలుకెళ్లడం ఖాయమని ఆయన చెప్పారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేసీఆర్ మీద రేవంత్ రెడ్డి మాట్లాడిన భాష సరైంది కాదన్నారు. ఇకపోతే ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు మాట్లాడే ముందు జాగ్రతగా ఉండాలని.. అంతేకానీ ఇలా దిగజారి మాట్లాడితే ఆ పదవికి ఉన్న గౌరవం తగ్గుతుందని బండి సంజయ్ హితవు పలికారు. మాజీ సీఎంపై రేవంత్ రెడ్డి వాడిన భాషమీదే తెలంగాణలో ప్రస్తుతం తీవ్ర చర్చ జరుగుతోందన్నారు. నీటి వాటాల అంశంలో తప్పు చేసిందే కేసీఆర్ అని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి , మాజీ సీఎం కేసీఆర్ లపై కేంద్రమంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అప్పుడు రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగిందని.. నీటి పంపకాల అంశంలో అప్పట్లో తాను చేసిన వ్యాఖ్యలను ఓ ఐఏఎస్ అధికారి ట్వీట్ చేశారని గుర్తుచేశారు. కృష్ణా జలాల అంశంలో కేసీఆర్ తప్పుడు నిర్ణయాల వల్లే ఇందంతా జరిగిందని విమర్శించారు. అనేకసార్లు అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ తప్పించుకున్నారన్నారు. కేసీఆర్‌ను రేవంత్ తిట్టడం వెనక సింపతీ పెంచే కుట్ర దాగుందని.. కానీ ఇందుకోసం మరీ ఇంత జుగుప్సాకరమైన భాష అవసరం లేదన్నారు. తెలంగాణాకు పట్టిన పెద్ద శని కేసీఆర్ కుటుంబమని బండి ధ్వజమెత్తారు. కేసీఆర్ శని కాబట్టే ప్రజలు ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశారని కామెంట్స్ చేశారు. కాళేశ్వరం స్కామ్ నుంచి తప్పించుకోవడానికే కేసీఆర్ కృష్ణా జలాల అంశాన్ని కొత్తగా తెరమీదకు తెచ్చారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం లాగే రేవంత్ రెడ్డి సర్కార్ కూడా పనిచేస్తోందని ఆయన ఆరోపించారు. అప్పుడు పథకాల అమలుపై ప్రజలు నిలదీస్తారని కేసీఆర్ కొత్త అంశాలను తెరపైకి తెచ్చేవారని.. ఇప్పుడు రేవంత్ సైతం అదే డ్రామా ఆడుతున్నారని కేంద్రమంత్రి విమర్శించారు. కృష్ణా జలాల గురించి మాట్లాడే హక్కు మాజీ సీఎం కేసీఆర్‌కు లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు దృష్టి మళ్లించడానికి కృష్ణా జలాల అంశం కేసీఆర్ లేవనెత్తుతున్నారని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా తానే అపెక్స్ కౌన్సిల్ సమావేశం పెట్టించా అని చెప్పారు. ఇక కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేయడాన్ని బండి సంజయ్ తప్పుబట్టారు. కేసీఆర్‌పై సీఎం రేవంత్ మాట్లాడిని భాష సరికాదన్నారు. సీఎం తన భాషపై పునరాలోచన చేయాలి. ప్రతీ వ్యక్తి సుఖ సంతోషాలతో ఉండాలని హిందూ ధర్మం కోరుకుంటుంది. కేసీఆర్ కుమారుడు అహంకారం తలకెకినట్టు మాట్లాడుతారు. గతంలో కేసీఆర్ మాట్లాడితే మేము ఖండించాం. సీఎం రేవంత్ మాట్లాడిన తీరు ఆయనకే నష్టం' అని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 'తెలంగాణకు నంబర్ వన్ ద్రోహి కేసీఆర్. కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ ఏమీ చేశారో ఆధారాలతో సహా బయట పెట్టింది ముందు నేనే. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలకే ఒప్పందం చేసుకున్నారు. ముడుపుల కోసం 575 టీఎంసీలు అడగలేదు. కేసీఆర్‌కు కృష్ణా జలాల గురించి మాట్లాడే హక్కు లేదు. అప్పుడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా నేనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం పెట్టించాను. కాళేశ్వరం స్కాం నుంచి దృష్టి మరల్చేందుకు కేసీఆర్ కృష్ణ జలాలు ఇష్యూ తెరపైకి తెస్తున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్, కేసీఆర్ మధ్య ఏం ఒప్పందం జరిగిందో చెప్పాలి. కేసీఆర్ కుటుంబమే తెలంగాణకు పెద్ద శని. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం' అని బండి సంజయ్ పేర్కొన్నారు.

# ముగిసిన పోలీసు కస్టడీ

మొదటి తరువాయి

ఇచ్చిన ఆదేశాల గురించి మరోసారి పై నలుగురు అధికారులను మరోసారి సిట్ అధికారులు విచారించారు. ఆ సమయంలో ప్రభాకర్‌రావును ఎదుటగానే ఉంచుకుని వారిపై ప్రశ్నల వర్షం కురిపించారు. మధ్యలో వారు చెబుతున్న అంశాలపై ప్రభాకర్‌రావును క్రాస్ ఇంటరాగేషన్ చేసి కొన్ని కీలక వివరాలను రాబట్టినట్టు తెలిసింది. ఆ సమయంలో సైతం ప్రభాకర్‌రావు కొన్ని ప్రశ్నలకు నో అంటూ సమాధానం ఇచ్చాడని తెలిసింది. కాగా, ఆయన నో అన్నప్పటికీ ఆయన కింద పనిచేసిన పై నలుగురు అధికారులు ఇచ్చిన సమాచారంలో ఉన్న నిజాలను దర్యాప్తు అధికారులు గట్టిగా విశ్వసిస్తూ దానికి సంబంధించిన ఆధారాలను సైతం సేకరించినట్టు తెలిసింది. మొత్తం మీద ఈ కీలక విచారణలో ఫోన్ ట్యాపింగ్ జరిగిన వ్యవహారం, జరిపించింది ఎవరు? వారి నేరాన్ని రుజువు చేసే ఆధారాలను సిట్ అధికారులు సమగ్రంగా సేకరించినట్టు తెలిసింది. శుక్రవారంతో ప్రభాకర్‌రావు కస్టడీకి సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన గడువు పూర్తికానుండటంతో ఆయనను విడుదల చేయడానికి అవసరమైన చర్యలను కూడా సిట్ అధికారులు తీసుకుంటున్నట్టు తెలిసింది. కాగా, ప్రభాకర్‌రావుకు సంబంధించిన పెన్‌డ్రైవ్ నుంచి ఫోన్ ట్యాపింగ్ చేశారనడానికి కీలకమైన ఆధారాలను అధికారులు విశ్లేషించి సేకరించారని సమాచారం. బీఆర్ఎస్‌కు చెందిన ప్రముఖ నేతల పాత్రను కూడా గుర్తించినట్టు తెలిసింది. ఈ విచారణలో సిట్ సభ్యులు అంబర్‌కిశోర్ ఝా, విజయ్ కుమార్, రితురాజ్, నారాయణరెడ్డి, శ్రీధర్, వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

**ప్రభాకర్‌రావు కుమారుడిని విచారించిన సిట్**

ఇదిలా ఉంటే, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు కుమారుడు నిశాంత్‌రావును సిట్ అధికారులు గురువారం నాలుగు గంటల పాటు విచారించారు. నిశాంత్‌రావు చేసే వ్యాపారాలు, ఇతర ఆర్థిక లావాదేవీల గురించి ఆరా తీసినట్టు తెలిసింది. ముఖ్యంగా, అతని బ్యాంక్ స్టేట్‌మెంట్లను ముందు ఉంచుకుని అందులో తమకు ఉన్న అనుమానాలను నిశాంత్ రావు ద్వారా నివృత్తి చేసుకునే ప్రయత్నాన్ని సిట్ అధికారులు చేశారు.

# తెలంగాణ బీజేపీ మరో కీలక నిర్ణయం

మొదటి తరువాయి



చేస్తున్నారని కాషాయ పార్టీ నేతలు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓటీపీ రాజాకీయాలు తెలంగాణలో చెల్లదంటూ స్పష్టం చేశారు. చేసిన తప్పు కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్ కేంద్ర ప్రభుత్వంపై నెపం పెడుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో కృష్ణా జలాల్లో 299 టీఎంసీల నీటి కోసం ఒప్పుదం చేసింది ఎవరనీ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు కమలం పార్టీ నేతలు. తెలంగాణకు నీటి వాటాలో అన్యాయం చేసింది కేసీఆరేనని ఆరోపిస్తున్నారు. ఇన్నాళ్లు ఫాంహౌస్‌లో ఉన్న కేసీఆర్ ఇప్పుడు బయటకు వచ్చి ఓటీపీ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఇప్పుడు తెలంగాణకు సరైన నీటి వాటా తీసుకురావడంలో విఫలం అవుతోందని మండిపడ్డారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూడా గతంలో కృష్ణా నీటిని తరలించుకు పోతుంటే కాంగ్రెస్ నేతలు ఎందుకు నోరు మెదపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో కూడా ఇదే అంశంపై తమ వాదనను బలంగా వినిపిస్తామని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. ఇప్పటికే నీటి వాటాలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చామని బీజేపీ నేతలు ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో తెలంగాణకు బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన అన్యాయంపై సమగ్ర సమాచారం అందిస్తామని బీజేపీ నేతలు హెచ్చరించారు.

# ఒడిషాలో భారీ ఎన్‌కౌంటర్

మొదటి తరువాయి

ఇటీవలి కాలంగా ఆరోగ్యం బాగాలేక ఇబ్బంది పడుతున్నారని సమాచారం. ఉాక హనుమంతు చిన్నప్పటినుంచే కమ్యూనిస్టు భావజాలం కలిగి ఉన్నారని ఆయన సోదరుడు తెలిపారు. హనుమంతు తండ్రి సీపీఎం పార్టీలో పనిచేశారు. దీంతో చదువుకునే రోజుల్లోనే ఉద్యమం వైపు వెళ్లారు.

# లక్నో గోమతీ నదీ తీరంలో ప్రేరణాస్థల్ ప్రారంభం

మొదటి తరువాయి

బీజం పడింది. 2014 నుంచి గ్రామాల్లో 4 లక్షల కి.మీ. రోడ్ల నిర్మాణం జరిగింది. దేశంలో ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణం మరింత పుంజుకుంది. వాజ్‌పేయి హయాంలోనే ఢిల్లీ మెట్రో ప్రారంభమైంది. భవిష్యత్‌లో అతిపెద్ద మొబైల్ ఫోన్ల ఉత్పత్తి దేశంగా భారత్ మారనుందని అన్నారు. అందరి కృషితోనే వికసిత్ భారత్ సాకారం అవుతుంది. లక్నోలో అతిపెద్ద డిఫెన్స్ కారిడార్ ఉంది. బ్రహ్మోస్ క్షిపణులు లక్నోలోనే తయారవుతున్నాయని అంటూ... మన బ్రహ్మోస్ క్షిపణుల సామర్థ్యం ప్రపంచమంతా చూసిందని అన్నారు. మొబైల్, ఇంటర్నెట్ వినియోగించే దేశాల్లో భారత్‌దే అగ్రస్థానం' అని అన్నారు. కాగా, సుమారు 65 ఎకరాల విస్తీర్ణంలో 230 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మితమైన రాష్ట్ర ప్రేరణా స్థల్ జాతీయ స్మారక సముదాయంలో అటల్ బిహారీ వాజ్‌పేయితో పాటు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయల ఆదర్శాలకు అనుగుణంగా వారి విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిఎం యోగి ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనంద్ బెన్ తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్‌లో హిందువులపై ఆగని దాడులు

మొదటి తరువాయి

గురువారం వేకువజామున 2 గంటల సమయంలో మృతిచెందాడు. సామ్రాట్ అనుచరుల్లో ఒకడైన మొహ్మద్ సెలిమ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి ఒక పిస్టల్, షూటర్ గన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. షేక్ హసీనా దేశం వీడిన తర్వాత సామ్రాట్ కొద్ది రోజులు అజ్ఞాతం గడిపాడని, ఇటీవలే గ్రామానికి తిరిగి చేరుకున్నాడని వెల్లడించారు. దీపూ చంద్రదాస్‌పై దాడి తర్వాత ఓ మైనారిటీ వ్యక్తిపై మూకదాడి జరగడం ఈ ఘటనపై అనుమానాలకు తావిస్తోంది.

# కే-4 బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతం

**3,500 కి.మీ. లక్ష్యాన్ని ఛేదించే సామర్థ్యం**

న్యూఢిల్లీ



విశాఖపట్నం తీరం సమీపంలోని బంగాళాఖాతంలో అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిహంత్ నుంచి 3,500 కిలోమీటర్ల లక్ష్యాన్ని ఛేదించగల కే-4 విధ్వంసక క్షిపణిని భారత్ గురువారం విజయవంతంగా పరీక్షించింది. 2 టన్నుల అణు బాంబును మోసుకుని వెళ్లగల సామర్థ్యమున్న కే-4 క్షిపణి జలాంతర్గాముల నుంచి దీర్ఘ శ్రేణి లక్ష్యాలను ఛేదించగలదు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ పేరిట చేపట్టిన కే-సిరీస్ క్షిపణులలో భాగంగా కే-4 తయారైంది. నేటి పరీక్షతో భారత్‌కు భూమి, ఆకాశం, సముద్రం నుంచి అణ్వస్త్రాలను ప్రయోగించగల సామర్థ్యం సాధించినట్లేనని అధికారులు తెలిపారు.

# ఘనంగా సూపరిపాలన దినోత్సవం

**ఆమనగల్, డిసెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):** సూపరిపాలన దినోత్సవం సందర్భంగా ఆమనగల్ మున్సిపాలిటీ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో అటల్ బిహారీ వాజ్‌పేయి చౌరస్తాలో మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ జెడ్పిటిసి, బీజేపీ రాష్ట్ర నాయకుడు కండె హరి ప్రసాద్ మాట్లాడుతూ దేశానికి సరికొత్త దశ, దిశను అందించిన మహెూన్నత వ్యక్తి వాజ్‌పేయి. ప్రధాని పదవికి వన్నె తెచ్చిన నిష్కళంక నేత, అజాతశత్రువు ఆయన జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించడం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నరసింహ, ఆమనగల్



మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెక్కల లక్ష్మణ్, పార్లమెంట్ బీజేవైఎం కో కన్వీనర్ రవి రాథోడ్, మాజీ కౌన్సిలర్లు కృష్ణ యాదవ్, చెన్నకేశవులు, శ్రీశైలం యాదవ్, మున్సిపాలిటీ బీజేవైఎం అధ్యక్షుడు నాగిళ్ల సందీప్, జానయ్య, చంద్రయ్య, తోట మల్లేష్, బుచ్చయ్య, నరసింహ, వెంకట్, తోట ఆనంద్, వడ్డే రాజు, అశోక్ యాదవ్, వెంకట్ యాదవ్, లండం మల్లేష్, శ్రీను యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వాజ్‌పేయి జయంతి వేడుకలు



**చింతపల్లి, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా గోడుకొండ్ల వీ.టీ నగర్ (మాల్ టౌన్)లో బీజేపీ గ్రామశాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనిగిరి గోవర్ధన్, లక్ష్మణసాగర్ బీజేపీ నాయకులు మాట్లాడుతూ వాజ్‌పేయి నేర్పిన సిద్ధాంతాల వల్లే దేశంలో రెండు సార్లు అధికారంలోకి వచ్చామని గుర్తుచేశారు. గ్రామాలు, పట్టణాలు రోడ్లు, రైల్వే కనెక్టివిటీతో అభివృద్ధి చెందేలా చేసిన ఆయన దూరదృష్టి, ఒక్క ఓటుతో అధికారం కోల్పోయినా వెనక్కి తగ్గని ధైర్యం, విలువలతో కూడిన రాజకీయాలు ఆయన చేసిన విశిష్ట కృషిగా కొనియాడారు. నేటి రాజకీయాలు కులం, ప్రాంతం పేరుతో నడుస్తున్నాయని ప్రజలు గమనించాలని సూచిస్తూ, వాజ్‌పేయి స్ఫూర్తితోనే ప్రస్తుతం ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని ముందుకు తీసుకెళు తున్నారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, ఎబివిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని వాజ్‌పేయి జ్ఞాపకాలను స్మరించుకున్నారు.

# నేడు లయన్స్ క్లబ్ సమావేశం

**ఆమనగల్, డిసెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు సమావేశం నేడు ఆమనగల్ పట్టణంలోని కళ్యాణి గార్డెన్లో సాయంత్రం 6 గంటలకు జరగనుంది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ చేపట్టే సేవా కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు లయన్స్ క్లబ్ పిఆర్ఓ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ గవర్నర్లు జి. చెన్న కిషన్ రెడ్డి, జూలూరి రమేష్ బాబు, మాజీ మల్టిపుల్ చైర్మన్ సందడి నరేందర్ రెడ్డి, రామ్ రెడ్డి, లయన్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ వి. దామోదర్ రెడ్డి, రీజియన్ చైర్మన్ సంపతి జనార్ధన్ రెడ్డి, జోన్ చైర్మన్ జూలూరి లింగయ్యలు హాజరుకానున్నారు. క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, పిఆర్ఓ పాషా ప్రకటనలో క్లబ్ సభ్యులందరూ విధిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# నూతన ప్రజా ప్రతినిధులను సన్మానించిన మాజీ వైస్ ఎంపీపీ



**ఎలిగేడు, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలోని నూతనంగా గెలుపొందిన సర్పంచులు, ఎలిగేడు గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులను గురువారం మాజీ వైస్ ఎంపీపీ, హైకోర్టు అడ్వకేట్ బుర్ర వీరస్వామి గౌడ్ తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో సర్పంచులు, వార్డు సభ్యులు కీలక పాత్ర పోషిస్తారని, ప్రజలతో మమేకమై సమిష్టిగా కృషి చేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నారాయణపల్లి సర్పంచ్ రంగు లత శ్రీనివాస్ గౌడ్, నర్సాపూర్ సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్, సుల్తానాపూర్ సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, ఎలిగేడు ఉప సర్పంచ్ ముంజం నరేష్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు చింతకుంట మనోహర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్, చింతలపల్లి చర్చిలను సందర్శించిన పాపిశెట్టి రాము



**ఆమనగల్, డిసెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** క్రైస్తవ మతస్తుల పవిత్ర క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఆమనగల్, చింతలపల్లి చర్చిలను సందర్శించిన పాపిశెట్టి రాము క్రైస్తవ సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్శనలో శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్ దాస్, శ్రీను నాయక్, భాస్కర్, లక్ష్మీపతి, ఫాస్టర్స్ మల్లేష్, ప్రభుశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బంజారా కాలనీ షాలోమ్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**దేవరకొండ డిసెంబర్ 25. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని బంజారా కాలనీలో షాలోమ్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ అననియా ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగను చర్చి సభ్యులతో కలిసి పంచుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ క్రీస్తు ఈ లోకానికి సర్వ మానవాళి పాప రక్షణకు దివి నుండి భూమికి దిగివచ్చి సత్యం, మార్గం, జీవం అని చాటి చెప్పినారు. అనంతరం ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్ అలంపల్లి నరసింహ మరియు సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ పాల్గొని క్రిస్మస్ కేకును క్రైస్తవ భక్తుల తోటి కలిసి కేక్ కట్ చేసినారు. అనంతరం మాజీ మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా జరిగేటటువంటి అతిపెద్ద పండుగ అని అందరూ సుఖశాంతులతో, శాంతి సమాదానంతో ఆ యేసు క్రీస్తు దయవల్ల అందరూ ఆయురారోగ్యాలతో మంచిగా ఉండాలని కోరారు. డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ , క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భాష నాయక్, రెడ్డి కోటేశ్వరరావు, ఎండి అబ్దుల్ కలాం, క్రైస్తవ భక్తులు, పిల్లలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# మనుస్మృతి గ్రంథ పత్రాలు దహనం



**దేవరకొండ డిసెంబర్ 25. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ పట్టణంలో స్థానికంగా ఉన్న డా బి ఆర్ అంబేద్కర్ ప్రతిమ ముందు వివిధ సంఘాల ఆధ్వర్యంలో మనుస్మృతి గ్రంథ పత్రాలు దహనం చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దేశంలో పాలకులు రాజ్యాంగం ప్రకారం పాలనాధికారాలు చెయ్యాల్సింది పోయి ఎప్పుడో అంతరించిన మనుస్మృతి రాజ్యాన్ని అమలు చెయ్యాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుంది అని తెలిపారు. అదేవిదంగా ఈ దేశంలో కులాలు, మతాలు, వర్గాలు, బేధాలుగా విభజించి పాలనా చేస్తున్నారని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యం బద్దంగా పాలన సాగాలన్న, ప్రజాస్వామ్యం వర్ధిల్లాలన్న, రాజ్యాంగం ప్రకారం పాలనా కొనసాగాలన్న కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఈ దేశ పౌరులుగా ప్రతి ఒక్కరు వారి నిర్ణయాలకు వ్యతిరేకం పోరాటం చెయ్యాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గత పది సంవత్సరాలనుండి అనేక రాజ్యాంగ వ్యతిరేక కార్యక్రమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. రాజారావు, ఎర్ర కృష్ణ జాంభవ్, ముదిగొండ ఎల్లేష్, గాదెపాకు జగదీశ్, చంద్రమౌళి, రవి, ప్రశాంత్, పెద్దయ్య, ఆంజనేయులు, సుదర్శన్, శాంతి రాజ్, చంద్రశేఖర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అటల్ జీ జయంతి కార్యక్రమం



**కరీంనగర్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారతరత్న, మాజీ ప్రధానమంత్రి, రాజనీతిజ్ఞుడు అటల్ బీహారీ వాజ్‌పేయి 101వ జయంతి సందర్భంగా సెంట్రల్ జోన్‌లోని స్థానిక టవర్ సర్కిల్ వద్ద జోన్ కన్వీనర్ తణుకు సాయి కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలో మాజీ కార్పొరేటర్ దుర్షేడ్ అనూప్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, కళ్యాం వాసుదేవ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దుబల శ్రీనివాస్, సీనియర్ నాయకులు వంగల పవన్, బండ రమణ రెడ్డి, మైనార్టీ మోర్చా నాయకులు బల్బీర్ సింగ్, ఎండీ పర్వేజ్, సెంట్రల్ జోన్ అధికార ప్రతినిధి బొడ్ల శ్రీరాములు, కలికోట మోహన్, రమణ, రమన్, జంగాలపల్లి కుమార్, జేడీ భగవాన్, పవన్ సతీష్, అరుణ్ రాకేష్, రవీంద్ర పాల్ సింగ్, శ్రీ వత్సవ్ తదితరులు పాల్గొన్నారు. జోన్ కార్యకర్తలతో కలిసి వాజ్‌పేయి జ్ఞాపకాలను స్మరించుకుంటూ కార్యక్రమాన్ని మరింత ఉత్సాహభరితంగా నిర్వహించారు. అనంతరం మిఠాయిల పంపిణీ జరిపి వేడుకను ముగించారు.

# అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్న ఆచారి



**ఆమనగల్లు, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు గుర్రంగుట్టలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి సహిత భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో భక్తి సభలతో అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఎంతో విశిష్టంగా జరిగింది. మస్న మురళీధర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పర్వంలో జాతీయ బీసీ కమిషన్ సభ్యులు, మాజీ గురుస్వామి తల్లోజు ఆచారి, పాపిశెట్టి రాముతో కలిసి పాల్గొని స్వామివారి సేవలో నిమగ్నమయ్యారు. ప్రభాత వేళ నుంచే ఆలయ పరిసరాలన్నీ “స్వామి శరణం అయ్యప్ప” నినాదాలతో మార్మోగాయి. భక్తులు దీక్షావ్రతంతో స్వామివారిని దర్శించుకుంటూ పుష్పాభిషేకం, హరిరామ భజన, ధ్వజారోహణ పర్వాలు వంటి సాంప్రదాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తీర్థప్రసాదాలతో సందడి నెలకొంది. భక్తి రాగాలు ఆలయ వాతావరణాన్ని మరింత ఆధ్యాత్మికంగా మలిచాయి. కార్యక్రమ నిర్వహణలో గురుస్వాములు దాస్యం వంశీ, గాజుల శ్రీను, కండె సాయి, అనిల్, మహేష్, అరుణ్, సచిన్ తో పాటు స్థానిక భక్తులు, సేవాదారులు శ్రమసేవను అందించారు. ఆధ్యాత్మిక వేడుకను చూసేందుకు పట్టణం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

# జిల్లా బిజెపి కార్యాలయంలో బగ్గుమన్న విభేదాలు

**-రణరంగంగా మారిన పార్టీ కార్యాలయం**



**నల్లగొండ ,డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**




నల్లగొండ జిల్లా బిజెపి కార్యాలయం గురువారం రణరంగంగా మారింది పార్టీ నాయకుల మధ్య విభేదాలు భౌతికదాడులకు దారితీశాయి. పార్టీ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి అనుచరులు, పార్టీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు అనుచరులు ఒకరిపై ఒకరు దాడికి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. సీనియర్ నాయకులు చూస్తుండగానే ఈ ఘర్షణ జరగడం గమనార్హం. గొడవను కవర్ చేస్తున్న మీడియా ప్రతినిధి నుంచి కెమెరా లాక్కొని మెమొరీ కార్డు ఫార్మాట్ చేయడం కలకలం రేపింది జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి అనుచరుడు తనపై దాడి చేశాడని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు యాదవ్ ఆరోపించారు.తనపై దాడి చేసిన వాడిని వదిలేది లేదని బీజేపీ కార్యాలయంలో భీష్మించుకు కూర్చున్నారు. తనని బూతులు తిడుతూ దాడి చేయడంతో కళ్ల జోడు విరిగిపోయిందని, తన కాళ్లు పట్టుకొని క్షమాపణ కోరే వరకు ఊరుకునేది లేదన్నారు మరోపక్క జర్నలిస్టులు తమపై జరిగిన దాడికి ఖండిస్తూ కార్యాలయం ముందు బయట ఇచ్చి క్షమాపణ చెప్పాలని కోరుకుంటూ చివరకు బయటకి వచ్చి బహిరంగ క్షమాపణ చెప్పటంతో జర్నలిస్టులు నిరసన విరమించుకున్నారు.

## బీజేపీ ఆఫీస్ ముందు జర్నలిస్టుల నిరసన,

-

**జర్నలిస్టులకు క్షమాపణ చెప్పిన బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి**



**నల్లగొండ ,డిసెంబర్ 25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**



బీజేపీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు యాదవ్ పై నాగం వర్షిత్ రెడ్డి అనుచరుడు దాడి చేస్తున్న ఘటనను వీడియో తీస్తున్న జర్నలిస్ట కెమెరాను బీజేపీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి గుంజుకొని ఫొటోలు ఫార్మాట్ చేయడంతో జర్నలిస్టులు భగ్గుమన్నారు. నాగం వర్షిత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ నల్గొండ బీజేపీ ఆఫీస్ ముందు బైఠాయించారు. మీడియాపై దాడిని ఖండిస్తున్నామన్నారు దాదాపుగా రెండు గంటలు బిజెపి కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన జర్నలిస్టులకు నాగం వర్షిత్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పడంతో దీంతో జర్నలిస్టులు నిరసన విరమించారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం.

**నల్లగొండ ,డిసెంబర్ 25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**



2000,2001 వివేకానంద విద్యా మందిర్ 10వ తరగతి విద్యార్థులు గురువారం స్థానిక మనోహర హోటల్లో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆనాటి మధుర స్మృతులను జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు పరిచయం చేసుకొని క్షేమ సమాచారం తెలుసుకున్నారు. ఎవరెవరు ఎక్కడెక్కడ ఏ ఉద్యోగాలలో స్థిరపడ్డారు కుటుంబ పరిస్థితులు పిల్లల పరిస్థితిలు తెలుసుకొని సంబరపడ్డారు. ఆనాటి చిలిపి పనులను నెమరు వేసుకున్నారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులైన బుచ్చిరెడ్డి, వేణుగోపాలరావు, వెంకటరెడ్డి,కరుణాకర్ రెడ్డి, రుక్మారెడ్డి లను,శాలువాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అన్వేష్, మహేష్, రమేష్, నాగార్జున రెడ్డి, లింగస్వామి, దీప్తి, సుకన్య, సరిత, లలిత, రజిత తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్ పోటీల్లో నిజామాబాద్ జట్టు విజయం

**మనోహరాబాద్, డిసెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో డిసెంబర్ 23 నుండి ప్రారంభమైన పదవ తెలంగాణ అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాలికల సాఫ్ట్ బాల్ చాంపియన్షిప్ పోటీలు నేటితో విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సమావేశానికి మనోహరాబాద్ మాజీ సర్పంచ్ చిటుకుల మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని ఇరవై జిల్లాల బాలికల జట్లు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాయి. ఉత్కంఠభరితంగా సాగిన తుది పోరులో నిజామాబాద్ జిల్లా జట్టు మహబూబ్నగర్ జట్టుపై ఆరు ఐదు స్కోర్ తేడాతో గెలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. మహబూబ్నగర్ జట్టు రజత పతకాన్ని అందుకోగా, మూడవ స్థానం కోసం జరిగిన పోటీలో ఆతిథ్య మెదక్ జిల్లా జట్టు వరంగల్ జట్టుపై ఎనిమిది-మూడు స్కోర్ తేడాతో విజయం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఈ కార్యక్రమంలో సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్ బాబు, తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, కోశాధికారి కుమారి రేణుక, సైబర్ క్రైం సర్కిల్ ఇన్స్పెక్టర్ రవి, నాయకులు వెంకట్ గౌడ్, మనోహరాబాద్ ఉప సర్పంచ్ వెంకట రెడ్డి, మెదక్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్ శర్మ, కోశాధికారి గోవర్ధన్ గౌడ్, శ్రీనివాస్, సురేష్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుండి విచ్చేసిన క్రీడాకారులు, కోచ్‌లు ఈ పోటీలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.








# కడ్తాల్ పిరమిడ్ లో కొనసాగుతున్న ధ్యాన సంబరం

**కడ్తాల్, డిసెంబర్ 25 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**

కడ్తాల్ పిరమిడ్ లో ధ్యాన సంబురాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ధ్యాన వేడుకల్లో పలువురు సందేశ మిస్తూ ఏసుప్రభు పక్కవారిని ప్రేమించమన్నారు ప్రతి ఒక్కరితో కలిసి ఉండడమే మరియు ఎలాంటి జీవినైనా హింసించకుండా చూడడమే నిజమైన మానవ లక్షణం అని అన్నారు. స్ఫూర్తిదాయకమైన మాటతో ఇంకా ధ్యాన ప్రచారం ఎక్కువగా చేయొచ్చు .. నీ శత్రువుని నువ్వు ప్రేమించడమే ఆధ్యాత్మికత ఎన్నో మాటలు ఎన్నో కష్టాలు ఎదురుకొని పత్రీజీ లక్షలాదిగా ధ్యానులుగా మార్చగలిగారు సహనంతో ఉండే వారే ధ్యానులు అందర్నీ ప్రేమించడమే ధ్యానుల లక్షణమని పేర్కొన్నారు. కడ్తాల్ కైలాసపురి పిరమిడ్ మాస్టర్ల పుట్టినిల్లు లాంటిది. ఇక్కడ నిరంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలని పత్రీజీ కోరిక... 365 రోజులు నిత్యం అన్నదానం జరుగుతూనే ఉంటుంది. ఈ కైలాసపురికి వచ్చే ప్రజలకు ఎప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడమే పిరమిడ్ మాస్టర్ల కర్తవ్యం ధ్యాన మహాయాగాలకు 10 లక్షల మందికి ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేశామని పిరమిడ్ చెర్మన్ భాస్కర్ రెడ్డి అన్నారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**నల్లగొండ ,డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**




నల్లగొండ పట్టణ కేంద్రం లోని షాలోమ్ వర్షిప్ సెంటర్, సుందరయ్య కాలనీలో క్రిస్మస్ ఆరాధన మరియు కార్యక్రమాలు బాగా జరిగాయి. బిషప్ డాక్టర్ సుధీర్ కుమార్ జిల్లెళ్ల క్రిస్మస్ సందేశాన్ని అందించారు. చర్చి నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. మిసెస్ ప్రిస్సిల్లా, సత్య జ్యోతి, సోదరులు డేవిడ్ రాజ్, ముత్తు, ప్రవీణ్, లాజరస్, శేఖర్, రెడ్డి, మణిక్యం, సోదరీమణులు అనిత, ఉమ, వినోదా మరియు భక్తులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. కేక్ కటిం గ్ తరువాత హాజరైన పిల్లలు అందరికి విలువైన బహుమతులు పంపిణీ చేశారు. యవ్వనస్తులు, పిల్లలు అందరు గాన ప్రతిగానములు, నాట్యములతో క్రిస్మస్ కార్యక్రమం చాలా ఆనందమయంగా కొనసాగింది సాగింది. న్యూ జెరూసలేం చర్చిలో కేక్ కటింగ్ మిర్యాలగూడ రోడ్ లోని న్యూ జెరూసలేం చర్చిలో ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు చెప్పిన ప్రేమ సంతోషము సమాధానము క్షమాపణ కలిగి ఉండాలని పాస్టర్ ఏసుక్రీస్తు చెప్పిన ప్రేమ సంతోషము సమాధానము క్షమాపణ కలిగి ఉండాలని పాస్టర్ తీగ లజాన్ శాస్త్రి అన్నారు. ప్రత్యేక పాటలు ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి నూతన సంవత్సర క్యాలెండర్ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉమా షకీనా, భాను ప్రకాష్, సిహెచ్ రవి, జోసఫ్, వీరబాబు, సంపత్, రాజు, జనార్ధన్, జ్యోషి రాయ్, నిస్సీ తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ వేడుకల్లో సుడా చైర్మన్

**కరీంనగర్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి నగరంలోని పలు చర్చిలను సందర్శించారు. ముందుగా సిఎస్ఐ చర్చిలో జరిగిన వేడుకల్లో పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి పాస్టర్‌కు తినిపించారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి యేసు క్రీస్తు ఆశీర్వాదం లభించాలని కోరుకున్నారు. క్రైస్తవుల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నగరంలోని ఇతర చర్చిలను సందర్శించి శు భాకాంక్షలు తెలియజేశారు.



# ఘనంగా క్రిస్మస్ వేడుకలు పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నల్లగొండ, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో ఉన్న పురాతన సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో రాష్ట్ర రోడ్లు & భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. కేక్ కట్ చేసి క్రిస్మస్ సంబరాల్లో భాగమైన మంత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ప్రజలంతా సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

**ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ**

యేసు క్రీస్తు జన్మదినం సందర్భంగా క్రైస్తవ సోదర, సోదరీమణులకు హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. యేసుక్రీస్తు బోధనలు ప్రేమ, శాంతి, త్యాగం, సేవాభావాన్ని ప్రపంచానికి నేర్పాయని పేర్కొన్నారు. మానవత్వం, క్షమాగుణం, సేవా తత్వాన్ని ఆచరించాల్సిన అవసరాన్ని ఆయన బోధనలు గుర్తుచేస్తాయని అన్నారు. మిషనరీలు, హాస్పిటళ్ల ద్వారా క్రైస్తవులు సమాజానికి అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. డిసెంబర్ నెల తెలంగాణ ప్రజలకు సంతోషాన్ని నింపిన నెలగా నిలిచిందని, డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన వెలువడిన రోజు, తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీ పుట్టినరోజు ఒకే రోజు కావడం గర్వకారణమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్ల తర్వాత ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం వంటి మానవీయ కోణంలో రూపొందించిన పథకాలను అమలు చేస్తున్నామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాళ్లతో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి, మంత్రులందరూ సమష్టిగా కృషి చేసి గత రెండేళ్లుగా రాష్ట్రాన్ని క్రమంగా గాడిలో పెడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. యేసు ప్రభువు కృపతో ప్రజలందరూ ఆనందంగా ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ వాయిస్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలిచిన మన వడ్డెరల కోసం సన్మానం



**దేవరకొండ,డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ రాష్ట్రంలో ఇటివల నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలలో మూడు విడితలలో గెలుపొందిన వడ్డెర కులస్తులు తెలంగాణ వ్యాప్తంగా 94 మంది సర్పంచులుగా 47 మంది ఉపసర్పంచ్లుగా 68 మంది వార్డు మెంబర్ లుగా గెలుపొందారు. వీళ్ళందరికీ ఈ నెల 27 శనివారం నాడు హైదరాబాద్ భాగలింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారీ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుంది. కాబట్టి గెలిచిన వడ్డెర కులానికి సంబంధించిన వాళ్ళు అందరూ ఉదయం 10 గంటల వరకు చేరుకోవాలని మిమ్మల్ని అందరిని కోరుకుంటున్నాను. ఈ యొక్క కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు అండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివరాత్రి ఆయుల మల్లు మరియు తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పీట్ల మల్లేష్ ఆధ్వర్యంలో జరుగుచున్నది. అందరూ తప్పకుండా గెలిచిన అభ్యర్థులు హాజరుకావాలని కోరుకుంటున్నాను. నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం వడ్డెర సంఘం అధ్యక్షులు ఇరగ దిండ్ల కృష్ణ కోరారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**వెల్దండ, డిసెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** వెల్దండ మండల కేంద్రంలోని ఎంబి నజరేత్ చర్చి యందు క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్దండ మండల సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పాస్టర్ సురేష్ మాట్లాడుతూ తమిళనాడులోని వేలంకన్నీ పట్టణం చరిత్రాత్మకతకు ప్రసిద్ధి చెందిన క్యాథలిక్ చర్చి బసిలికా ఆఫ్ అవర్ లేడీ ఆఫ్ గుడ్ హెల్త్ గురించి వివరించారు. డిసెంబర్ 24 అర్ధరాత్రి ప్రార్థన, క్రిస్మస్ కరోల్స్, బాణాసంచా ప్రదర్శన, రంగురంగుల లైట్లు, నక్షత్రాలు, వీధి దీపాలు క్రిస్మస్ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు. చర్చి సభ్యులు సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు కేక్ కట్ చేసి సంఘస్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉప సర్పంచ్ ఎర్ర శీను, వార్డు సభ్యులను కూడా ఘనంగా సన్మానించారు. సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య వేడుకల్లో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందని, ఇలాంటి వేడుకలు మళ్లీ మళ్లీ జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శీను, వార్డు సభ్యులు సునీత, ఆనంద్, వెంకటేష్, సిరిసనగండ్ల శేఖర్, కొండల్, కిష్టాలు, వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు మట్ట భరత్ గౌడ్, జాషువా, గోరేటి కృపానందం, కూన పాండు, లాజర్, ప్రవీణ్, అల్లాడి రంగయ్య, కూన సావిత్రి, జంగిలి జంగయ్య, ఎంకమ్మ, అల్లాడి మన్నెమ్మ, జంగిలి మరియమ్మ, జంగిలి బాబు, కృపమ్మ, దారకాంతమ్మ, గోరేటి శాంతమ్మ, జంగిలి అరుణ, జంగిలి దేవరాజ్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇనాం గూడ చర్చిలో క్రిస్మస్ వేడుకలు



**అబ్దుల్లాపూర్ మెట్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని ఇనాం గూడ గ్రామపంచాయతీ పరిధిలో హ్యాపీ మేరీ క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. లష్కర్ గూడ గ్రామపంచాయతీ నూతనంగా ఎన్నికైన ఆరో వార్డు సభ్యురాలు గుండె లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు చర్చిలో కేకు కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె లక్ష్మమ్మ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి వార్డు సభ్యురాలిగా గెలిపించిన ప్రజలకు క్రిస్మస్ పండుగ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ గుండె చిన్న రంగయ్య, గుండె పెద్ద జంగయ్య, గుండె యాదగిరి, గుండె మహేష్, గుండె శ్రీనివాస్, గుండె శ్రీశైలం, గుండె రవి, గుండె శ్రీను తదితరులు పాల్గొని క్రిస్మస్ ఉత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు.

# కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యం



**వనపర్తి డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ పటిష్టతకై అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నిక ఏదైనా కాంగ్రెస్ జెండానే ఎగరాలని, పార్టీ సత్తా చాటాలని ఆయన స్పష్టం చేశారు. వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొత్త కాపు శివసేన రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఆయనకు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన డీసీసీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరిన వారు ఇందిరాపార్క్, రాజీవ్ చౌరస్తా మీదుగా అంబేద్కర్ చౌరస్తాకు చేరి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో జరిగిన సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆబ్కారి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు కూడా పాల్గొన్నారు. సభలో ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బి ఆర్ ఎస్ పార్టీ పని అయిపోయిందని, కుటుంబ కలహాలతో పార్టీ కూలిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టు వనపర్తి నియోజకవర్గానికి ఎలాంటి లాభం చేకూర్చలేదని, కేవలం కమిషన్ల కోసం పనులు చేసి అర్ధాంతరంగా వదిలేశారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులకు బొక్కలు పెట్టి మేం నీరు తెచ్చామని చెప్పడం సిగ్గుచేటు అని అన్నారు. నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేసి కలలను నెరవేర్చినది ఇందిరమ్మ రాజ్యం, కాంగ్రెస్ ప్రభుత్వమే అని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో వనపర్తి నియోజకవర్గంలో అందరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ కోసం కృషి చేసే ప్రతి ఒక్కరిని గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే మేఘారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



**అచ్చంపేట, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పవిత్ర క్రిస్మస్ పండుగ సందర్భంగా అచ్చంపేట పట్టణ కేంద్రంలోని వివిధ చర్చిలలో ప్రార్థన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేతలు చర్చిలను సందర్శించి భక్తులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ గంగాపురం, అచ్చంపేట ఎస్సై సద్దాం, రాజేందర్, మాజీ ఎంపీపీ రామనాథం, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతల రాజగోపాల్, కపిలవాయి శేఖర్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. నాయకులు క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సౌభ్రాతృత్వం, ప్రేమ, శాంతి విలువలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

# ఎల్‌బీ నగర్‌లో అటల్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం



**ఎల్‌బీ నగర్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎల్‌బీ నగర్ చౌరస్తాలో భారతరత్న, మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేన రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, మేడ్చల్ రూరల్ జిల్లా ప్రబారి సామ రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ తో పాటు ఎల్బీనగర్ బీజేపీ కార్పొరేటర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి సేవలు దేశ రాజకీయాలకు మార్గదర్శకమని, ఆయన ప్రజాసేవలో చూపిన నిబద్ధత ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. రాజకీయాలకు గౌరవం తీసుకొచ్చిన నేతగా, దేశ భద్రత, మౌలిక వసతులు, రహదారుల అభివృద్ధి వంటి రంగాల్లో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్న మహానుభావుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

## ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి పునరావాస పథకం

**కరీంనగర్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లాలో ట్రాన్స్‌జెండర్లకు ఆర్థిక పునరావాస పథకం కింద రూ.75 వేల చొప్పున మూడు యూనిట్లకు మొత్తం రూ.2.25 లక్షలు 100 శాతం సబ్సిడీతో కేటాయించారు. అర్హులైన వారు అవసరమైన ధృవపత్రాలతో డిసెంబర్ 31లోపు జిల్లా సంక్షేమ అధికారి, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల శాఖ వద్ద దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ పథకం ద్వారా ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు కల్పించి, ఆర్థిక స్థిరత్వం సాధించడమే లక్ష్యమని జిల్లా సంక్షేమ శాఖ అధికారి సరస్వతి తెలిపారు.

# దేశంలో అసమానతలకు కారణం మనుస్మృతే,మనువాదం ఆశాస్త్రీయమైనది.

-ఆర్ఎస్ఎస్,సంఘ్ పరివార్ తోనే దేశానికి ప్రమాదం.
-రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి.
కెవిపిఎస్,సామాజిక ప్రజాసంఘాల నేతలు



**నల్లగొండ ,డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** ప్రపంచంలో ఎక్కడా లేనంతగా భారత దేశంలో సామాజిక అసమానతలను సృష్టించి, వివక్షతలకు కారణమైనది మనుధర్మ శాస్త్రమేనని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున,తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు పందుల సైదులు,టిపివైఎస్ జిల్లా అధ్యక్షులు మానుపాటి బిక్షం,ఆశాస్త్రీయమైన మనుస్మృతిపై మండిపడ్డారు.ఆశాస్త్రీయమైన మనుధర్మ శాస్త్రాన్ని నిషేధించాలని, ఈ దేశ బహుజన సామాజిక వాదులంతా మనువాదాన్ని ఈ దేశ మట్టిలోనే పాతరేయాలని పిలుపునిస్తూ 1927 డిసెంబర్ 25న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మను ధర్మ శాస్త్రాన్ని మహారాష్ట్రలోని రాయగడ్ జిల్లాలో వేలాది మంది దళిత బహుజనలతో కలిసి దగ్ధం చేయడం జరిగింది. అదే సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం రోజున నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ సామాజిక ప్రజా సంఘాల తెలంగాణ విద్యావంతుల వేదిక, ,తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం,ప్రగతిశీల యువజన సంఘం,మాల మహనాడు)ఆధ్వర్యంలో మనుధర్మ శాస్త్రానికి సంబంధించిన ప్రతులను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున,మాట్లాడుతూ....

అసంబద్ధమైన,అనాగరికమైన ఆలోచనల ద్వారా వేయిల సంవత్సరాలుగా మనుషుల మధ్య సామాజిక అంతరాలు సృష్టించింది మనుస్మృతేనని వారన్నారు.భారతదేశంలో మెజార్టీ ప్రజలకు సహజ సిద్ధమైన ప్రకృతి వనరులను దూరం చేయడానికి దుర్మార్గమైన కర్మ సిద్ధాంతాన్ని నమ్మించడానికి ప్రపంచంలో మరెక్కడలేని విధంగా ఈ దుర్మార్గపు సిద్ధాంతం మన దేశంలో బ్రాహ్మణీయ మనువాద శక్తులు అమలు చేస్తున్నాయన్నారు. దాని దుష్ఫలితాలు నేటికి అనేక అసమానతలకు మూలాలుగా కొనసాగుతున్నాయన్నారు.చదువు,భూమి ఆభరణాలు, ఆయుధాలు,అధికారాలు అన్ని కొద్దీ మంది చేతుల్లో ఉంచుతుంది మనుస్మృతే అన్నారు.. మెజార్టీ ప్రజలు నిషేధించిన మనుస్మృతి భావాలను తుదముట్టించకపోతే ఈ దేశ ప్రజలు వేల ఏండ్లుగా అనుభవిస్తున్న అన్ని రకాల వివక్షతలు అసమానతలు దోపిడీ వంశపారంపర్యంగా కొనసాగి కొందరు కోటీశ్వర్లుగా,కోట్లాది మంది బికార్లుగా శాశ్వతంగా నిలబడే ప్రమాదం ఉందన్నారు.మనుధర్మశాస్త్రం భారతీయ సమాజాన్ని గతంలోను,ఇప్పుడు విస్తృతంగా అంతిమంగా మనుస్మృతి దోపిడి వర్గాలకు సైద్ధాంతిక పునాదిగా నిలిసిందన్నారు. కాలక్రమంలో రూపాలలో తేడా వుండవచ్చు కాని సారం లో తేడా లేదా బ్రాహ్మణ ఆధిపత్యాన్ని కాపాడటానికి, దోపిడివ్యవస్థ రక్షణకై పుట్టిందే మనువాదం అన్నారు.

**బిజెపి,ఆర్.ఎస్.ఎస్ దేశానికి ప్రమాదం**

**పందుల సైదులు**

**తెలంగాణ విద్యావంతుల వేదిక**

తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు పందుల సైదులు మాట్లాడుతూ 1950 లో ప్రస్తుతమున్న రాజ్యాంగం అమలు లోకి వచ్చిందన్నారు. ఈ రాజ్యాంగానికి మనువాద మూలాలపై దాడి చేసే శక్తి వుందన్నారు. దీని ద్వారా ప్రజాస్వామ్య చట్టాలు అమలుకు వచ్చాయి.సామాజిక వర్గాలు కొన్ని ప్రయోజనాలుపొందాయి. ఈమాత్రం వెసులుబాటు ను కూడా అగ్రకుల సంపన్న వర్గాలు,అగ్రకుల సంపన్న వర్గాల ప్రతినిధిగా వ్యవహరిస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్, సంఘపరివారమర్ శక్తులు భరించలేక పోతున్నాయన్నారు.ఏది ఏమైనా మళ్లి మనుధర్మాన్ని ప్రతిష్టించాలని మనువాద పాలకులు చూస్తున్నారు. మనకెందుకీ అంబెద్కర్ రాజ్యాంగం మనకున్నది మనుధర్మం ని అనంతకుమార్ హెగ్డే(బిజెపి ప్రముఖ నాయకులు మాజీ కేంద్రమంత్రి)అనడం (13-8-2019)గమనార్హం అన్నారు.జొన్నవిత్తుల రామలింగ శాస్త్రి, చిన జియార్ స్వామి నిస్సిగ్గు గా,అనాగరిక పద్దతిలో బూజుపట్టిన,సనాతన మనుధర్మాన్ని, కుల వ్యవస్థ నుబహిరంగంగా సమర్థించడం చూస్తున్నామన్నారు..గోవాల్కర్ నుండి నేటి మోహన్ భగవత్ దాకా,శ్యాంప్రసాద్ ముఖర్జీ నుండి నేటి మోడి వరకు ఎవరు,ఎప్పుడు ఎక్కడ మాట్లాడినా మన ధర్మం అంటూ మాట్లాడుతున్నారన్నారు..మన ధర్మం అంటే మనుధర్మమే అనడమంటే ఇంతకంటే అనాగరికమైన చర్య మరొకటి ఉండదన్నారు.ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరి సాగర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గోలి సైదులు, గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న,మాలల ఐక్యవేదిక జిల్లా నాయకుడు అద్దంకి రవీందర్,మాల మహానాడు జాతీయ కార్యదర్శి తెలగమల యాదగిరి, కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి గాదే నరసింహ్మా, కెవిపిఎస్ మండల కార్యదర్శి బొల్లు రవీందర్, సిఐటియు పట్టణ కన్వీనర్ ఔట రవీందర్,సిఐటియు జిల్లా నాయకులు దండంపల్లి సత్తయ్య డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ కెవిపిఎస్ పట్టణ నాయకులు కోటా సైదులు నలుప రాజు సైదులు మురళి సిహెచ్ తిరుపతయ్య గోలి మల్లేష్ యూత్ లీడర్ జయచందన్ పెరికె నరసింహ రామలింగయ్య సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలిగేడులో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**ఎలిగేడు, డిసెంబర్ 25(నీలగిరి ఎక్స్ ప్రెస్)** : మండల కేంద్రంలోని బిలీవర్స్ చర్చి లో క్రిస్మస్ వేడుకలను రెవరెండ్ పాస్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న హైకోర్టు న్యాయవాది, ఎలిగేడు మాజీ వైస్ ఎంపీపీ బుర్ర వీరస్వామి గౌడ్ మాట్లాడుతూ. మతసామరస్యానికి ప్రతీకగా అందరూ కలిసి సాంప్రదాయా వేడుకలను జరుపుకోవడం గర్వకారణమని ఆయన అన్నారు. క్రీస్తు బోధనలు బలమైన సమాజాన్ని నిర్మించేందుకు దోహదపడతాయన్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్, నారాయణపల్లి సర్పంచ్ రంగు లత శ్రీనివాస్ గౌడ్ ఉప సర్పంచ్ ముంజం నరేష్ మాట్లాడుతూ క్రిస్టియన్ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మధు, కార్తీక్, మాజీ వార్డ్ సభ్యులు తాటిపల్లి సతీష్ బాబు, ముత్కల మల్లేశం విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లోకి చేరికలు

- బీజేపీ నుంచి 150మందికి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీ లోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** కాంగ్రెస్ పార్టీగ్రామ అభివృద్ధికి బలమైన నాయకత్వాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు మండలపరిధిలోని మేడిగడ్డ గ్రామానికి చెందిన బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు సుమారు 150 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు.కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే, కసిరెడ్డి నారాయణరెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఘనంగా పార్టీలోకి ఆహ్వానించారుఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిగారు మాట్లాడుతూ.రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి గ్రామ అభివృద్ధికి బలమైన నాయకత్వాన్ని అందించాలని పిలుపునిచ్చారు.గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.కాంగ్రెస్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి సమర్థవంతంగా అమలవుతాయని ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గ్రామ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని కోరారు. కార్యక్రమంలో కుమార్, మణిపాల్, గోపాల్,పాండు,శంకర్, శ్రీను,గోపాల్, రవీందర్, హరి,లోక,జైపాల్, పాండు,రాములు, మల్లేష్,రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎం.బి. ప్రార్థనా మందిరంలో భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ మహోత్సవం





**నాగర్‌కర్నూలు, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కేంద్రంలోని ఎం.బి. ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ మహోత్సవాన్ని మంగళవారం ఆధ్యాత్మిక గాంభీర్యంతో, భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలనుండి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు సాగిన కార్యక్రమంలో ప్రత్యేక గానాలు, తిరువాక్య ప్రవచనం, శుభాకాంక్షలు ప్రార్థన మందిరాన్ని పండుగ వాతావరణంతో నింపాయి.కర్నూలు ప్రాంతం నుంచి విచ్చేసిన తిరువాక్య బోధకుడు మోజస్ సందేశమందిస్తూ "దేవుని ప్రేమకు ప్రత్యక్ష రూపమే క్రీస్తు అవతారం ఆయన జననం మానవాళికి శాశ్వత వెలుగు పాపం అనే చీకటి నుండి విముక్తి కలిగించడానికి దేవుడు మానవ రూపం ధరించాడు" అని పేర్కొన్నారు. 'దేవుడు త్రిమూర్తి స్వరూపి క్రిస్మస్ జననం విశ్వ చరిత్రలో దివ్యమైన ఘట్టం" అని స్పష్టం చేశారు.యువకులు, మహిళలు ఆలపించిన క్రిస్మస్ ప్రత్యేక గానాలు సభను ఆధ్యాత్మిక మాధుర్యంతో అలరించాయి. వేడుకలో ప్రధాన అతిథిగా పాల్గొన్న మండల పరిషత్ శాసన మండలి సభ్యుడు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ"నాగర్‌కర్నూలు క్రైస్తవ సమాజ అభివృద్ధికి ఎల్లప్పుడూ తోడుగా ఉంటాము దేవుని కృప అందరి జీవితాల్లో నిలిచి ఉండాలి" అని ఆకాంక్షించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కోసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ మహోత్సవంలో ఎం.బి. సంఘం అధ్యక్షుడు సంపత్ కుమారుడు, కార్యదర్శి విజయ్ కుమారుడు, కార్యవర్గ సభ్యులు, పట్టణ పోలీసు విభాగాధికారి పుర్రి శ్రీనివాసులు, సుమారు అయిదువందల మంది విశ్వాసులు పాల్గొని కార్యక్రమాన్ని మరింత విశిష్టంగా మార్చారు.

# కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచేది జనసేవాదళ్



**మహబూబాబాద్, డిసెంబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మహబూబాబాద్ పట్టణంలోని సిద్ధార్థ గ్రౌండ్లో సిపిఐ యువకామ్రేడ్స్ ఆధ్వర్యంలో జనసేవాదళ్ శిక్షణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలకు అండగా నిలిచి వారిని రక్షించే బాధ్యత జనసేవాదళ్ తీసుకుంటుందని తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచి, దోపిడీ నుండి రక్షించేందుకు నిరంతరం ఉద్యమిస్తుందని ఆయన పేర్కొన్నారు.సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా రేపు పట్టణంలో జనసేవాదళ్ కవాతు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకులు, జనసేవాదళ్ శిక్షకులు వీరవిల్లి రవి, వెలుగు శ్రావణ్, జలగం ప్రవీణ్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, కేదాసు రమేష్, మంద శంకర్, తండా శ్రీనాథ్, మేక వెంకటేష్, పవన్, లక్ష్మణ్, బల్లెం శ్రీకాంత్, నటరాజ్, రాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# పీర్జాదిగూడ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

పలు క్రిస్టియన్ కుటుంబాలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసిన..
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి రవీందర్



**హైదరాబాద్ డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రపంచ శాంతి దూత ఏసుక్రీస్తు పుట్టినరోజు పురస్కరించుకొని పీర్జాదిగూడ సర్కిల్ మున్సిపల్ కార్పొరేషన్ విహారిక ట్రెజరర్ గూగులోత్ శ్రీనివాస్ నాయక్ కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి రవీందర్.ఈ కార్యక్రమంలో విహారిక కాలనీ అధ్యక్షులు ఎస్ సుధాకర్,నాయకులు సురేష్ నాయక్, మాజీ వార్డ్ మెంబర్ వెంకటేష్ యాదవ్,ఎం నరేష్, ఎన్ పరమేష్, భగవంతు నాయక్, గణేష్, విహారిక కాలనీవాసులు వారి కుటుంబ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

# అంగరంగ వైభవంగా క్రిస్మస్ వేడుకలు



**మహబూబాబాద్, డిసెంబర్ 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రపంచ పండుగగా ఖ్యాతిగాంచిన ఏసు క్రీస్తు జన్మదిన వేడుకలు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పలు చర్చిలలో అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రత్యేక ఆరాధనలతో చర్చిలు మారుమ్రోగాయి.క్రిస్మస్ ఆరాధన మహోత్సవంలో క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఏసు క్రీస్తును కీర్తిస్తూ ఆలపించిన భక్తి గీతాలు, కీర్తనలు భక్తులను అలరించాయి. ఆయా చర్చిల ఫాస్టర్లు భక్తులకు శాంతి సందేశాన్ని అందించారు.ఈ సందర్భంగా చర్చి ఫాదర్ నాగభూషణం మాట్లాడుతూఏసు క్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడిచి పలువురికి ఆదర్శంగా నిలవాలని, కులమతాలకు అతీతంగా యావత్ ప్రపంచం పరమానందంగా జరుపుకునే పండుగ క్రిస్మస్ అని పేర్కొన్నారు.అనంతరం క్రైస్తవ సోదరులు ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# అమ్రాబాద్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**అమ్రాబాద్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండల మన్ననూర్ గ్రామంలో క్రిస్మస్ పండుగను చర్చిలో ఘనంగా నిర్వహించారు. యేసు ప్రభువు జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఇస్లావత్ మంజుల మాట్లాడుతూ చర్చికి లైట్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేతో మాట్లాడినట్లు తెలిపారు. మాజీ జెడ్పిటిసి, సి.బి.ఎం ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అనురాధ చర్చిని అభివృద్ధి చేయడానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ భగవంతుని చేరుకోవడానికి మార్గాలు వేర్వేరు అయినా లక్ష్యం ఒక్కటేనని, ఎవరినీ బాధ పెట్టకుండా జీవనశైలిని కొనసాగించాలని సూచించారు. శంభు వెంకటరమణ మాట్లాడుతూ దేవుని దృష్టిలో అందరూ సమానమని, కరుణామయుడైన యేసు ప్రభువు అదే సందేశం ఇచ్చారని పేర్కొన్నారు.సర్పంచ్ మంజుల కేక్ కట్ చేసి పాస్టర్ కుటుంబాన్ని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యక్షురాలు శంభు శోభ వెంకటరమణతో పాటు భక్తులు పాల్గొన్నారు.

# అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఘన నివాళులు



**అచ్చంపేట, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మండికారి బాలాజీ మాట్లాడుతూ, అటల్ జీవితం, ఆయన విలువలు భారత రాజకీయాలకు ఆదర్శమని, దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.వాజ్‌పేయి పుట్టినరోజును కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా సుపరిపాలన దినోత్సవంగా జరుపుకుంటుందని గుర్తు చేశారు. ఆయన కేవలం రాజకీయ నాయకుడిగానే కాకుండా గొప్ప కవి, వక్తగా భారతదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేశారని అన్నారు. పోఖ్రాన్‌లో అణు పరీక్షలు నిర్వహించి భారత్‌ను అణ్వాయుధ దేశంగా నిలబెట్టడం, కార్గిల్ యుద్ధంలో విజయాన్ని సాధించడం, గ్రామ సడక్ యోజన, సర్వ శిక్షా అభియాన్, టెలికాం విప్లవం, చంద్రయాన్-1 ఆమోదం వంటి నిర్ణయాలు ఆయన నాయకత్వంలో జరిగాయని వివరించారు.ఈ కార్యక్రమంలో మంగ్య నాయక్, ముక్తాల రేణయ్య, శంకర్ మాదిగ, రామచంద్రయ్య, శ్రీరాములు, రంగినేని రవీందర్, మహేశ్వరి, వెంకటేష్, బయ్యా రాజు, అభినవ్ యాదవ్, నేడిగంటి అమర్ నాథ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా తొంటి మధూకర్



**జూలపల్లి, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా చీమలపేట గ్రామ ఉపసర్పంచ్ తొంటి మధూకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా కోనరావుపేట ఉపసర్పంచ్ కత్తెర్ల రాజమల్లు, ఉపాధ్యక్షులుగా కాచాపూర్ ఉపసర్పంచ్ దాడి మనోహర్, వడ్కాపూర్ ఉపసర్పంచ్ మొగురం రాజేశం, జనరల్ సెక్రటరీగా కీచులాటపల్లె ఉపసర్పంచ్ కొమ్మ అనూష, సభ్యులుగా పెద్దపూర్ ఉపసర్పంచ్ జెల్ల కనుకయ్య, బాలరాజుపల్లె ఉపసర్పంచ్ హరికిషన్, వెంకట్రావుపల్లె ఉపసర్పంచ్ పల్లెర్ల రవి ఎంపికయ్యారు.మండల సమగ్ర అభివృద్ధి, గ్రామాల పురోభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సమిష్టి కృషిని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ ఎన్నికలు నిర్వహించబడ్డాయి.తొంటి మధూకర్ మాట్లాడుతూ, నాపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు బాధ్యత మరింత పెరిగింది. అందరి సహకారంతో మండల పరిధిలోని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తాను. ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సహకారంతో గ్రామాల అభివృద్ధి సాధించేందుకు ప్రయత్నిస్తాను అని తెలిపారు.

# గీతాంజలి హైస్కూల్ విద్యార్థులకు మంత్రి అభినందనలు



**పెద్దపల్లి, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర రోబోటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ప్రథమ బహుమతి సాధించిన గీతాంజలి హైస్కూల్ విద్యార్థులను ఐటి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అభినందించారు.హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు మంత్రిని కలవగా, ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్న మీ ప్రతిభ అమోఘం. ఇలాంటివి మరెన్నో విజయాలు సాధించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలి అని మంత్రి పేర్కొన్నారు.విద్యార్థులు తెలంగాణ భవిష్యత్తును ముందుకు నడిపించే నవీన ఆలోచనలకు ప్రతిరూపమని, రాష్ట్రం ఎస్‌టీఈఎం విద్యపై పెట్టుబడి పెడుతున్నదానికి ఈ విజయం నిదర్శనమని అన్నారు. ఈ విజయాన్ని జాతీయస్థాయి పోటీల్లో కూడా కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రేపాల రజిత, అకడమిక్స్ హెడ్ రేపాల రోహిత్‌తో పాటు ఇతరులు పాల్గొన్నారు.

# ఏఈఓల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



**కరీంనగర్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్‌లోని టీఎన్జీవోల సంఘ భవనంలో జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈఓ) సంఘం ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఏకగ్రీవంగా ముగిశాయి.ఈ ఎన్నికలకు అగ్రికల్చర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హరికృష్ణ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, రాష్ట్ర అగ్రికల్చర్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ పర్యవేక్షకులుగా హాజరై ఏఈఓల సమస్యలు, ఐక్యతపై మాట్లాడారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, సేవకులే నాయకులవుతారు. బాధ్యత తీసుకుని పనిచేస్తే మనమే నాయకులమవుతాం. సంఘం అంటే సమిష్టి కలయిక, ఐక్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుంది అని అన్నారు. తెలంగాణ సాధన కోసం ఉద్యోగులు ఎదుర్కొన్న కేసులను గుర్తు చేస్తూ, ఇప్పటికీ పీఆర్సీ, డీఏలు, రిటైర్ అయిన వారికి హెల్త్ కార్డులు లాంటి సమస్యలు పరిష్కారం కావలసి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఎన్నికల్లో రవికుమార్ రంగు అధ్యక్షుడిగా, వెంకటస్వామి కార్యదర్శిగా, శ్రావణ్ కుమార్ ట్రెజరర్‌గా, ఉదయ్ కుమార్ సహ అధ్యక్షుడిగా, మహేందర్, సాయికుమార్, సుచరిత ఉపాధ్యక్షులుగా, రాజు, నిఖిల్, సాయి ప్రసన్న, రాజశేఖర్, అనంతరాజు, రాకేష్, రాంప్రసాద్, శిరీష సభ్యులుగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పదరాలో అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి కార్యక్రమం



**పదరా, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండల కేంద్రంలో భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మదినం సందర్భంగా కార్యక్రమం జరిగింది. మండల అధ్యక్షులు నీలం రవి, అమ్రాబాద్ మండల అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పదర ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు గంగిశెట్టి నాగరాజు మాట్లాడుతూ, పోఖ్రాన్‌లో అణు పరీక్షలు జరిపి, కార్గిల్ యుద్ధంలో ఘన విజయం సాధించి, పేదల కోసం అంతోదయ పథకం ప్రవేశపెట్టి, గ్రామాలకు రహదారులు వేసి, ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడిగా వాజ్‌పేయి గుర్తింపు పొందారని అన్నారు. ఆయన దేశభక్తి, త్యాగం, సుపరిపాలనతో ప్రజలను మంత్రముగ్ధులను చేసిన అజాతశత్రువు అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కొయ్యల మల్లేష్, గోలి శ్రీనివాసులు, పగిడి పాల అనిల్, నోముల శంకర్ గౌడ్, చంద్రయ్య యాదవ్, ప్రతాప్ నాయక్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంచాలలో అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి కార్యక్రమం





**మంచాల, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాజీ ప్రధాన మంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి సందర్భంగా మంచాల మండల బీజేపీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.మంచాల మండల అధ్యక్షుడు నూకం రాజు (విజయ్ కుమార్) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చి రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వింజమూరి వెంకట్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు దన్నే బాషయ్య, జిల్లా నాయకులు పాండాల జంగయ్య గౌడ్, మహేశ్వరం గోవర్ధన్ చారి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చివిరల పాండు, కొత్తగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, యువ మోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉర్సు రంగాపూర్‌లో ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు





**అమ్రాబాద్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామంలోని హజ్రత్ నిరంజన్ షావలి దర్గా వద్ద లో వోల్టేజ్ సమస్యలతో భక్తులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా. వంశీ కృష్ణ ముందుచూపుతో చర్యలు తీసుకున్నారు. జనవరి 17న జరగనున్న గంధం ఉత్సవం, రంగాపూర్ జాతర దృష్ట్యా తక్షణమే అధికారులను ఆదేశించి కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ చైర్మన్ ఎండీ రఫీ, గ్రామ సర్పంచ్ శివ, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. మైనారిటీ నాయకులు ఈ నిర్ణయంపై కృతజ్ఞతలు తెలిపారు.

# కిసాన్ గ్రామీణ మేళా ప్రారంభం



**కరీంనగర్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో కిసాన్ జాగరణ్ అధ్యక్షుడు పి. సుగుణాకర్ రావు ఆధ్వర్యంలో కిసాన్ గ్రామీణ మేళా వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మాజీ గవర్నర్, మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించారు.రైతుల సమస్యలు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలపై దత్తాత్రేయ తన ప్రసంగంలో ప్రస్తావించారు. మేళా వేదికగా రైతులకు అవగాహన, ప్రోత్సాహం కల్పించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# రహదారి దుస్థితిపై సిపిఐ ఆగ్రహం



**కరీంనగర్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కట్ట రాంపూర్ నుండి కోతి రాంపూర్ వెళ్లే రహదారి సంవత్సరాలుగా దయనీయ స్థితిలో ఉందని, వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మండిపడ్డారు. గురువారం సిపిఐ ఆధ్వర్యంలో రహదారిని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రధాన రహదారులను మాత్రమే బాగు చేస్తూ అంతర్గత రహదారులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని మున్సిపల్ అధికారులపై విమర్శలు గుప్పించారు. కమిషనర్ నిర్లక్ష్యం సిగ్గుచేటు అని, స్మార్ట్ సిటీ పేరుతో కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నామని చెప్పి వాస్తవానికి అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. నగరంలోని అనేక వీధుల్లో ఇదే పరిస్థితి ఉందని, రోడ్లు సరిగా లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ సిటీ పనుల్లో జరిగిన అవినీతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. వెంటనే రహదారి పనులు ప్రారంభించకపోతే ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు న్యాలపట్ల రాజు, కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కసిబోజుల సంతోష చారి, గామినేని సత్యం, అనంతగిరి, రమేష్, మాదాసు రాములు, శంకర్, సందీప్, నాగరాజు, బ్రహ్మం, శ్రీ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# చల్ల స్వరూపరాణిహరి శంకర్ దంపతుల జన్మదిన వేడుకలు



**కరీంనగర్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగర మాజీ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరి శంకర్ దంపతుల జన్మదిన వేడుకలు శ్రేయోభిలాషులు, అభిమానుల మధ్య పండుగ వాతావరణంలో ఘనంగా జరిగాయి. మంకమ్మతోటలోని సత్యనారాయణ స్వామి ఆలయం, పాతబజారులోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితులు ఆశీర్వదించారు. తరువాత మున్నూరు కాపు సంఘం, గౌడ సంఘం, లెజెండ్ వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. 37వ డివిజన్ మహిళలు శాలువాతో సత్కరించగా, మీసేవ కార్యాలయంలో కూడా సంబరాలు జరిగాయి. హౌసింగ్ బోర్డులోని వీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో అన్నదానం, మొక్కలు నాటడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, అభిమానులు హరి శంకర్‌స్వరూపరాణి దంపతులు ఆయురారోగ్యాలతో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో మిత్రులు, బంధువులు, పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ పోటీలకు హుస్నాబాద్ క్రీడాకారుల ఎంపిక



**హుస్నాబాద్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల 25 నుండి 28 వరకు జరుగుతున్న 72వ సీనియర్ పురుషుల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన మోలుగురి రాకేష్, కోయిలకరి శ్రీశైలం, బైరి అఖిల్, గుళ్ళ రణిల్, మణికంఠ ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎంపికా పోటీల్లో ప్రతిభ కనబరిచిన వీరిని సిద్దిపేట జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కే. శివకుమార్ తెలిపారు. వీరిని రాష్ట్ర రవాణా మరియు బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సిద్దిపేట జిల్లా గ్రంథాలయం చైర్మన్ కేడేమ్ లింగమూర్తి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్ గుప్తా, స్టేషన్ సెక్రటరీ శివకుమార్, పిడి ఆర్ శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారుడు గద్దల రమేష్, కోచ్ మడక కృష్ణ అభినందించారు. హుస్నాబాద్ క్రీడాకారుల ఎంపికతో స్థానిక క్రీడాభిమానులు ఆనందం వ్యక్తం చేశారు.

# కరీంనగర్‌లో క్రికెట్ మ్యాచ్‌లో ముఖ్య అతిథిగా సునీల్ రావు






**కరీంనగర్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: అల్గునూరులోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ గ్రౌండ్‌లో కాకా వెంకటస్వామి మెమోరియల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన తెలంగాణ అంతర్-జిల్లా టి20 లీగ్‌లో పెద్దపల్లికరీంనగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ముగింపులో మాజీ మేయర్, బీజేపీ నాయకుడు యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లా నుండి మరిన్ని ప్రతిభావంతులైన ఆటగాళ్లు దేశస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నగరంలో అద్భుతమైన క్రికెట్ గ్రౌండ్‌ను అందించిన ఆగమ రావు మరియు టీమ్‌కు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. క్రికెట్ అనేది కేవలం అవకాశం బట్టి ఆడే ఆట కాదని, అంకితభావంతో ఆడితే అనేక అవకాశాలు లభిస్తాయని అన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి ఆటగాడికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు మహేందర్ గౌడ్, మురళీధర్ రావు, అజిత్ రావు, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. క్రిస్మస్ వేడుకల్లో సునీల్ రావు అదే రోజు క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సునీల్ రావు క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి పండుగను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. శాంటా క్లాస్ అలంకరణలో చిన్నారులు కనువిందు చేశారు.

# ఘనంగా అటల్ జయంతి కార్యక్రమాలు





**కరీంనగర్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారతరత్న, మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి సందర్భంగా కరీంనగర్‌లో వివిధ ప్రాంతాల్లో కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. సెంట్రల్ జోన్ టవర్ సర్కిల్‌లో జోన్ కన్వీనర్ తణుకు సాయి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దుర్శేడ్ అనూప్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, కళ్లెం వాసుదేవ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దుబల శ్రీనివాస్, వంగల పవన్, బండ రమణ రెడ్డి, మైనార్టీ మోర్చా నాయకులు బల్బీర్ సింగ్, ఎండీ పర్వేజ్, బొడ్ల శ్రీరాములు, కలికోట మోహన్, జి.వి. రమణ, జంగాలపల్లి కుమార్, జేడీ భగవాన్, పవన్ సతీష్, అరుణ్, రాకేష్, రవీంద్ర పాల్ సింగ్, శ్రీ వత్సవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. గణేష్ నగర్‌లో కూడా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలిపాక అంజన్న, జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం వాసుదేవ రెడ్డి, జోన్ కన్వీనర్ తణుకు సాయి కృష్ణ, బొడ్ల శ్రీరాములు, కూర మహిపాల్ రెడ్డి, కొలిపాక శ్రీనివాస్, జంగాలపల్లి కుమార్, కొత్ర తిరుమల్, శ్రీ యజ్ఞ, అరుణ్, సురేష్, పార్థసారథి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు అటల్ జీ సేవా తత్వం, దేశభక్తి, సుపరిపాలనను స్మరించుకున్నారు.

# హుజురాబాద్‌లో అటల్ జయంతి వేడుకలు




**హుజురాబాద్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారతరత్న, మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి సందర్భంగా హుజురాబాద్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అటల్ జీని గొప్ప కవి, దేశభక్తుడిగా, అజాతశత్రువుగా కొనియాడుతూ, ఆయన దేశం కోసం అహర్నిశలు శ్రమించి సేవ చేసిన మహనీయుడని నాయకులు గుర్తు చేశారు. ప్రభుత్వాలు వస్తూ పోతాయి, పార్టీలు ఏర్పడి కనుమరుగవుతాయి, కానీ దేశం మాత్రం శాశ్వతం అని అటల్ జీ చెప్పిన మాటలను స్మరించారు. ఆయన జీవితం తరతరాలకు స్ఫూర్తి అని, కేంద్ర ప్రభుత్వం ఆయన జయంతిని సుపరిపాలన దినోత్సవంగా ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రావుల వేణు, పట్టణ మాజీ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, మాజీ కౌన్సిలర్ పైళ్ళ వెంకట్ రెడ్డి, నల్ల సుమన్, నరాల రాజశేఖర్, తిప్ప బత్తిని రాజు, కొలిపాక శ్రీనివాస్, ఎంసాని శశిధర్, కొడిమ్యాల పవన్, అంకతి వాసు, యాలసంజీవరెడ్డి, గంటసంపత్, కందుల శ్రీనివాస్, బింగి కరుణాకర్, మోడెప్ వినయ్, సొల్లు మోహన్, ఆవుల సదయ్య, క్యాస వెంకటేష్, తాళ్లపల్లి దేవేంద్ర, భీమోజి వెంకట్, రాపాక రాజు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలో వరుస చేరికలు




**గన్నేరువరం, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణరెడ్డి, మండల అధ్యక్షుడు తిప్పర్తి నీకేష్ ఆధ్వర్యంలో గన్నేరువరం మండలంలో వరుసగా చేరికలు జరిగాయి. జంగపల్లి గ్రామ సర్పంచ్ తాడూరి కరుణ రమణారెడ్డి, గన్నేరువరం 12వ వార్డ్ సభ్యుడు ఏలేటి శ్రీకాంత్ రెడ్డి, బిఆర్ఎస్ మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ సిరిగిరి తిరుపతి బీజేపీలో చేరారు. ఈ చేరికలతో మండలంలో బీజేపీ గ్రాఫ్ మరింతగా పెరుగుతోందని నాయకులు పేర్కొన్నారు.

# శ్రీ ఆనందగిరి సుందర శాస్త్ర సన్నిధానంలో మహా పడిపూజ



**గంగాధర, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్‌లో శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో 18 మెట్ల వద్ద మహా పడిపూజ కార్యక్రమం గురువారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. గుంజి మల్లికార్జున రావు గురుస్వామి శిష్యబృందం ఆధ్వర్యంలో, ధర్మకర్త శ్వేతమధుకర్ గురుస్వామి ఆశీస్సులతో జీకే శ్రీనివాస్, బాస్యం శ్రీనివాస్, చంద్రమౌళి, హరిశర్మ గురుస్వాములు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో అయ్యప్ప దీక్షపరులు, భక్తులు భజనలతో పాల్గొని భక్తి వాతావరణాన్ని సృష్టించారు. ఈ కార్యక్రమానికి గుంజి మల్లికార్జున రావు, ఉడత శ్రీనివాస్, కొల్లిపర పనింద్ర, గోపికృష్ణ కన్య, బాల లక్ష్మయ్య, మాల్యాద్రి, కోటకొండ మహేష్, పబ్బ మహేష్, నలుమాచు హరికిషన్, చిలివేరి మనోహర్, చిలివేరి సతీష్, రేగూరి కరుణాకర్, బొల్లం ఆంజనేయులు, చొక్కారపు వెంకటేశ్వర్లు, బొంగు శ్రీనివాసులు, ఉడుత నరసయ్య, వెన్నెల శ్రీహరి, గొట్టాపు సాయి బాబు, బత్తిని సుదర్శన్, వేముల రమేష్ దాతలుగా నిలిచారు. వారి కుటుంబాలకు అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని భక్తులు ప్రార్థించారు.

## బీఎస్పీ ఇన్చార్జి విమర్శలు




**హుస్నాబాద్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ నియోజకవర్గ బీఎస్పీ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. కొడంగల్‌లో జరిగిన సర్పంచుల సన్మాన సభలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు చట్టంపై నమ్మకం లేనట్టుగా ఉన్నాయని, ఇది ప్రజాస్వామ్యానికి అవమానకరమని ఆయన అన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు కెసిఆర్ ప్రభుత్వం లక్ష కోట్ల దోపిడీ చేసిందని, ఫోన్లు ట్యాపింగ్ చేశారని, ధరణి పేరిట భూముల దోపిడీ జరిగిందని, కేటీఆర్ అవినీతికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ అధికారంలోకి వస్తే జైలుకు పంపుతామని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు "ఎవరి పాపాన వారే పోతారు" అని మాట్లాడటం దారుణమని విమర్శించారు.కాంగ్రెస్, టిఆర్ఎస్ కలిసిపోయాయని ఆరోపిస్తూ, బీఎస్పీ వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తుందని రవీందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వంలా, ప్రజలకు విద్య, వైద్యం, ఇతర సమస్యలపై కాంగ్రెస్ నిర్లక్ష్యం చేస్తే ప్రజలు ఖచ్చితంగా బొంద పెడతారని హెచ్చరించారు.

## తెలంగాణ చౌక్‌లో వెలిచాల రాజేందర్ రావు జన్మదిన వేడుకలు



**కరీంనగర్, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు జన్మదిన వేడుకలు నగరంలోని తెలంగాణ చౌక్‌లో యువసేన జిల్లా అధ్యక్షుడు కాసరపు కిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు.వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంజన్ కుమార్ మాట్లాడుతూ రాజేందర్ రావు పేద ప్రజలకు వెన్నుదన్నుగా నిలుస్తూ, నిజాయితీతో ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారని, ఆయన సంపూర్ణ ఆరోగ్యాలతో ఉండి రాబోయే రోజుల్లో మరిన్ని ప్రజాసేవలు చేయాలని ఆకాంక్షించారు.జన్మదినాన్ని పురస్కరించుకొని వాడవాడన వేడుకలు జరిగాయి. కొత్తపల్లిలో రక్తదానం, గడ్డ వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ, గీతభవన్ చౌరస్తాలో టపాసులు కాల్చి కేక్ కటింగ్, దర్గాలో చాదర్ సమర్పణ, ఆటోనగర్ వృద్ధాశ్రమంలో అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ వేడుకల్లో పాల్గొన్న నాయకులు, అభిమానులు రాజేందర్ రావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండి మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.

## అయ్యప్ప పడిపూజలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు పాల్గొనడం



**జగిత్యాల, డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జగిత్యాల రూరల్ మండలం పొలస గ్రామంలోని అయ్యప్ప దేవాలయంలో మహా పడిపూజ సందర్భంగా నిర్వహించిన కుంకుమ పూజ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా మిల్కూరి రాజన్న, ఓల్లాల రాజశేఖర్, కూర్మ రమేష్, సంఘ తిరుపతి, గడ్డి మల్లేష్, గోసంగారి నాగరాజు, జుంగోని లత శంకర్, ముద్దం నీలకంఠ, మసీదు వాణి సుధాకర్, కూర్మ రాజు, గడ్డం గంగాధర్, ఉప్పు కిషన్, రెంటం తిరుపతి, ఎడ్ల మల్లయ్య, రెంటం గంగారెడ్డి, బుర్ర వేణు, నడిపి గంగన్న, అటుకుల సులోచన, బిడుదల లక్ష్మణ్, బోనగిరి అనిల్, దశరథ రాజశేఖర్, కత్రోజి భూమేష్, సిద్ధం అఖిల్ తో పాటు మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.భక్తి వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు అయ్యప్ప స్వామి ఆశీస్సులు కోరుకున్నారు.

# ఇకపై సైనికులూ ఇన్‌స్టాగ్రామ్ వాడొచ్చు..

## రక్షణశాఖ అనుమతి..!



**న్యూఢిల్లీ డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** భారత సైనికులు ఇన్‌స్టాగ్రామ్ వినియోగించడంపై కఠిన వైఖరి అవలంబిస్తూ వస్తున్న భారత రక్షణ శాఖ.. తాజాగా ఈ నిబంధనలను కాస్త సడలించినట్లు సమాచారం. ఇక నుంచి సైనికులు, సైనికాధికారులు ఇన్‌స్టాగ్రామ్‌ను వీక్షించేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలుస్తున్నది. ఈ మేరకు రక్షణశాఖ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా సంస్థలు కథనాలు వెల్లడించాయి. అయితే ఇన్‌స్టా వినియోగానికి అనుమతించినా అందుకు కొన్ని షరతులు కూడా విధించినట్లు తెలుస్తోంది.తాజా సవరణలకు సంబంధించి అన్ని సైనిక యూనిట్లకు ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ మార్గదర్శకాలు పంపించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. కేవలం సమాచారం తెలుసుకునేందుకు మాత్రమే సైనికులు ఇన్‌స్టాగ్రామ్‌ను ఉపయోగించాలని, పోస్టులు చేయడం, కామెంట్లు పెట్టడం, షేరింగ్, మెసేజ్‌లకు రియాక్ట్ అవడం వంటివి చేయకూడదనే కఠిన ఆంక్షలు మార్గదర్శకాల్లో ఉన్నట్లు తెలిసింది. అంటే సైనికులు ఇన్‌స్టాగ్రామ్‌ను వీక్షించవచ్చు కానీ.. అందులో ప్రతిస్పందించేందుకు అనుమతి ఉండదు. ఇవే నిబంధనలు ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ లాంటి ఇతర మాధ్యమాలకు కూడా ప్రస్తుతం అమల్లో ఉన్నాయి. సైనికులు, సైనికాధికారులు తమ ఖాతాల్లో తప్పుదోవ పట్టించే పోస్టులు, నకిలీ సమాచారం ఉన్నట్లయితే వాటిని తక్షణమే సీనియర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని రక్షణ శాఖ మార్గదర్శకాల్లో పేర్కొన్నట్లు సమాచారం. వీపీఎన్‌లు, నకిలీ వెబ్‌సైట్లు, వెబ్ ప్రాక్సీలు వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోను ఉపయోగించవద్దని సైనికులను మరోసారి హెచ్చరించారు. డిజిటల్ అవగాహన, దేశ భద్రత మధ్య సైనికులు సమతూకంగా ఉండాలని ఈ మార్గదర్శకాల్లో పేర్కొన్నట్లు తెలిసింది. సైనికులు సోషల్ మీడియాను వినియోగించడంపై ఎప్పటికప్పుడు సమీక్ష చేయనున్నట్లు డిఫెన్స్ మినిస్ట్రీ తెలిపిందని మీడియా కథనాల్లో పేర్కొన్నారు.

## మహిళా ప్రయాణికులకు మహిళా డ్రైవర్లు!

**ఓలా, ఉబర్, ర్యాపిడో యాప్‌లో స్త్రీలు మహిళా డ్రైవర్‌ను ఎంచుకునే అవకాశం**
**కొత్త నిబంధనలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం**



**న్యూఢిల్లీ డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** క్యాబ్ అగ్రిగేటర్ కంపెనీలకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ కొత్త నిబంధనలను జారీ చేసింది. ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి కంపెనీల వాహనాలను యాప్ ద్వారా బుక్ చేసుకునే మహిళా ప్రయాణికులు మహిళా డ్రైవర్లను ఎంపిక చేసుకోవడానికి అవకాశం కల్పించింది. ప్రయాణికులు తమ గమ్య స్థానానికి చేరుకున్న తర్వాత డ్రైవర్‌కు టిప్ ఇవ్వవచ్చు. ఈ టిప్ సొమ్ము మొత్తం డ్రైవర్‌కే అందుతుంది. కొత్త నిబంధనల ప్రకారం, క్యాబ్ అగ్రిగేటర్లు తమ యాప్‌లలో స్త్రీ లేదా పురుష డ్రైవర్ (జెండర్)ను ఎంపిక చేసుకునేందుకు తగిన ఫీచర్‌ను పెట్టాలి. అయితే, సేమ్ జెండర్ డ్రైవర్లు అందుబాటులో ఉండటంపై ఈ ఆప్షన్ ఆధారపడి ఉంటుంది.

**టిప్ సొమ్ము పూర్తిగా డ్రైవర్‌కే**

కొత్త నిబంధనల ప్రకారం, ప్రయాణికులు తమను గమ్యస్థానానికి చేర్చిన డ్రైవర్‌కు టిప్ స్వచ్ఛందంగా ఇవ్వవచ్చు. అయితే, యాప్‌లో ఈ టిప్‌నకు సంబంధించిన ఆప్షన్ బుకింగ్ సమయంలో కానీ, ట్రిప్ ప్రయాణ సమయంలో కానీ కనిపించదు. ట్రిప్ పూర్తయిన తర్వాత మాత్రమే కనిపిస్తుంది. ప్రయాణికుడు ఇచ్చే టిప్ పూర్తిగా డ్రైవర్ ఖాతాకే వెళ్తుంది.

**పీక్ అవర్స్‌లో రెట్టింపు కన్నా ఎక్కువ వసూలు చేయరాదు**

కంపెనీలు బేస్ ఫేర్‌లో 50 శాతం కన్నా తక్కువ వసూలు చేయవచ్చు. కానీ రద్దీ వేళల్లో (పీక్ అవర్స్) 'సర్జ్ ప్రైసింగ్' బేస్ ఫేర్‌కు రెట్టింపు కన్నా ఎక్కువ వసూలు చేయరాదు. ప్రయాణికుడి ఇంటి నుంచి కార్యాలయానికి సాధారణ ఛార్జీ రూ.50 అయినపుడు, రద్దీ సమయంలో రూ.100 కన్నా ఎక్కువ వసూలు చేయరాదు.

**డెడ్ మైలేజ్‌కు ఛార్జి చేయరాదు**

పికప్ పాయింట్ వద్దకు వాహనాన్ని తీసుకెళ్లడానికి అయ్యే ఖర్చును (డెడ్ మైలేజ్‌ని) ప్రయాణికుడి నుంచి వసూలు చేయరాదు. ఈ దూరం 3 కి.మీ. కన్నా తక్కువ ఉంటే, ప్రయాణికుడి నుంచి పరిమిత ఛార్జిని మాత్రమే తీసుకోవచ్చు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కంపెనీల లైసెన్స్‌లను రద్దు చేయవచ్చు

## మాకు ఓటేస్తే.. థాయ్‌లాండ్ ట్రిప్, బంగారం, లగ్జరీ కార్లు

**ఓటర్లకు అభ్యర్థుల ఎన్నికల హామీలు**



**పూణె డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఎన్నికలు వచ్చాయంటే అభ్యర్థులు ఓటర్ల ను ఆకర్షించేందుకు పలు పథకాలు, బహుమతులు, హామీలూ ప్రకటిస్తుంటారు. తాజాగా పూణె మున్సిపల్ ఎన్నికలు ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అందుకు కారణంగా అక్కడి ఓటర్లకు అభ్యర్థులు ఇచ్చిన హామీలే. గెలుపే లక్ష్యంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు ఖరీదైన కానుకలను ప్రకటిస్తున్నారు. విదేశీ ట్రిప్పులు, బంగారు ఆభరణాలు, లగ్జరీ కార్లు వంటి ఉచితాలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.పూణె మున్సిపల్ ఎన్నికలకు మరో మూడు వారాల సమయం ఉంది. అధికారం కోసం పోటీ పడుతున్న కౌన్సిలర్లు ఓటర్లను ఆకర్షించేందుకు పలు హామీలు ఇస్తున్నారు. లోహ్‌గావ్-ధనోరి వార్డులో ఓ అభ్యర్థి లక్కీ డ్రా నిర్వహించారు. ఈ డ్రా ద్వారా 11 మంది ఓటర్లకు ఒక్కొక్కరికి 1,100 చదరపు అడుగుల భూమిని ఇస్తానని హామీ ఇచ్చారు. ఇందుకోసం రిజిస్ట్రేషన్ కూడా ప్రారంభమైంది. ఇక విమన్ నగర్‌లో అభ్యర్థులు ఓ అడుగు ముందుకేసి ఓటర్లకు విదేశీ ట్రిప్పును ప్రకటించారు. తమకు ఓటు వేసి గెలిపిస్తే ఐదు రోజులపాటూ థాయ్‌లాండ్‌కు లగ్జరీ టూర్‌న అందిస్తామని హామీ ఇచ్చారు. ఇక మరికొన్ని చోట్ల లక్కీ డ్రా ద్వారా ఖరీదైన ఎస్‌యూవీ కార్లు, ద్విచక్ర వాహనాలు, మహిళా ఓటర్లకు పైథానీ, పట్టు చీరలు, బంగారు, వెండి ఆభరణాలు వంటి హామీలతో ఓటర్లను ఆకర్షిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఓటర్లకు ఇప్పటికే బహుమతులను కూడా అందించినట్టు తెలుస్తోంది. కొందరు కుట్టు మెషీన్లు, సైకిళ్లు పంపిణీ చేశారు. ఇక క్రీడా ఔత్సాహిక ఓటర్ల కోసం రూ.లక్ష నగదు బహుమతితో క్రికెట్ లీగ్‌లు ఏర్పాటు చేశారు.

## డేట్ కెళితే రూ.30 వేల ప్రోత్సాహకం



**సియోల్ డిసెంబర్ 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** డేట్‌కు కెళ్లండి.. సొమ్ము తీసుకోండి.. అంటూ యువతను బతిమలాడుతున్నది దక్షిణ కొరియా ప్రభుత్వం. రోజురోజుకూ తగ్గిపోతున్న జనాభా, అతి తక్కువ జనన రేటు నమోదు పట్ల తీవ్ర ఆందోళనతో ఉన్న ప్రభుత్వం యువ జంటలను వివాహం వైపు ప్రోత్సహించడానికి ఆకర్షణీయమైన పథకాలను ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా బుసాన్ నగర ప్రభుత్వం డేటింగ్ చేయమంటూ యువతను ఆహ్వానించింది. డేటింగ్ చేసే జంటకు రూ.30 వేలు ప్రోత్సాహకంగా అందజేస్తున్నది. తర్వాత వారు కనుక వివాహం చేసుకుంటే రూ.12 లక్షలు అందజేస్తుంది. అలాగే వారు ఇల్లు కొనుక్కోవడానికి కూడా ప్రభుత్వం సహాయం చేస్తుంది. 24 ఏండ్ల నుంచి 43 ఏండ్ల వయసున్న వారెవరైనా ఈ కార్యక్రమంలో చేరవచ్చు. ఇందులో చేరాలనుకునే వారు ఒక దరఖాస్తు నింపాలి. తర్వాత వారికి స్క్రీనింగ్, ఇంటర్వ్యూ ఉంటుంది.

# బిజినెస్

## మళ్లీ రికార్డ్.. భారతదేశంలో అత్యధికంగా అమ్ముడైన బైక్ ఇదే.



హీరో స్ప్లెండర్ మరోసారి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. నవంబర్ 2025లో ఇది 348,569 యూనిట్లను అమ్మింది కంపెనీ. ఇది నవంబర్ 2024తో పోలిస్తే 18.6 శాతం ఎక్కువ. ఈ మోటార్‌సైకిల్ చాలా కాలంగా భారతదేశంలో అత్యధికంగా అమ్ముడైన ద్విచక్ర వాహనం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లో ఉంది. హోండా యాక్టివా 262,689 యూనిట్ల అమ్మకాలతో రెండవ స్థానంలో నిలిచింది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 27% పెరుగుదల. యాక్టివా దేశంలో అత్యధికంగా అమ్ముడైన స్కూటర్‌గా నిలిచింది. దాని నమ్మకమైన ఇమేజ్, బలమైన బ్రాండ్, విస్తృత శ్రేణి వేరియంట్‌లకు ధన్యవాదాలు. హోండా షైన్ 186,490 యూనిట్ల అమ్మకాలతో మూడవ స్థానంలో నిలిచింది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 28.1 శాతం పెరుగుదల. ఇది సాధారణ-ప్రయోజన మోటార్ సైకిళ్లకు నిరంతర డిమాండ్‌ను సూచిస్తుంది. తర్వాత స్థానంలో టీవీఎస్ జూపిటర్ ఉంది. ఇది 124,782 యూనిట్లను విక్రయించింది. ఇది సంవత్సరానికి 25.1 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది భారతదేశంలో రెండవ అత్యధికంగా అమ్ముడైన స్కూటర్‌గా నిలిచింది. బజాజ్ పల్సర్ 113,802 యూనిట్ల అమ్మకాలతో ఐదవ స్థానంలో నిలిచింది. అమ్మకాలు గత సంవత్సరంతో పోలిస్తే 0.6 శాతం స్వల్పంగా తగ్గినప్పటికీ, స్పోర్టీ విభాగంలో పల్సర్ ఉనికి బలంగా ఉంది. నవంబర్ నెలలో హీరోHF డీలక్స్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. 91,082 యూనిట్లు అమ్ముడయ్యాయి. గత సంవత్సరంతో పోలిస్తే 48.7 శాతం బలమైన వృద్ధిని నమోదు చేశాయి. దీని తక్కువ ధర, నమ్మదగిన పనితీరు బడ్జెట్ కస్టమర్లను ఆకర్షిస్తుంది. సుజుకి యాక్సెస్ 67,477 యూనిట్లను విక్రయించింది. ఇది సంవత్సరానికి 24.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ప్రీమియం స్కూటర్ విభాగంలో దాని ప్రజాదరణను కొనసాగిస్తోంది. టీవీఎస్ అపాచీ 48,764 యూనిట్లను విక్రయించింది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 36.9% వృద్ధి. ఇది పనితీరు మోటార్ సైకిళ్లకు నిరంతర డిమాండ్‌ను ప్రతిబింబిస్తుంది.

## బంగారం ధరల్లో ఊహించని మార్పు.. తులం ఎంత పెరిగిందంటే..?

దేశంలో బంగారం ధరల పెరుగుదుల కొనసాగుతూనే ఉంది. పసిడి ధరలకు బ్రేక్ పడటం లేదు. రోజురోజుకి పెరుగుతూ సామాన్యులకు షాక్ ఇస్తున్నాయి. సోమవారం నుంచి భారీ స్థాయిలో పెరుగున్న గోల్డ్ రేటు.. గురువారం కూడా ఆకాశాన్నంటింది. గురువారం కూడా మారోసారి బంగారం రేట్లు పెరిగాయి. గురువారం తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఒక్కసారి చూద్దాం.

**నేడు బంగారం ధరలు ఇలా..**

-హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల ప్యూర్ గోల్డ్ రేటు రూ.1,38,940 వద్ద కొనసాగుతోంది. నిన్న ఈ ధర రూ.1,38,930 వద్ద స్థిరపడింది. ఇక 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,27,360 వద్ద కొనసాగుతోంది. నిన్న ఈ ధర రూ.1,27,3501గా



ఉంది.

-విజయవాడలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,38,940గా ఉండగా.. 22 క్యారెట్లు వచ్చి రూ.1,27,360గా ఉందని చెప్పవచ్చు.

-విశాఖపట్నంలో 24 క్యారెట్లు రూ.1,38,940గా ఉండగా.. 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,27,3601 వద్ద కొనసాగుతోంది.

-బెంగళూరులో 24 క్యారెట్ల ప్యూర్ గోల్డ్ ధర రూ.1,38,940 వద్ద ఉండగా.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,27,360 వద్ద కొననసాగుతోంది.

-చెన్నైలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,39,650 వద్ద కొనసాగుతోండగా.. నిన్న ఇది రూ.1,39,640 వద్ద స్థిరపడింది

**వెండి ధరలు**

-చెన్నైలో కేజీ వెండి ధర రూ.2,44,100గా ఉంది

-బెంగళూరులో కేజీ వెండి రూ.2,33,100గా ఉంది

-హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.2,44,100 వద్ద కొనసాగుతోంది. ఇక విజయవాడ, విశాఖపట్నంలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి

## స్టార్టప్‌లకు ఐపీవో కిక్కు

న్యూఢిల్లీ, డిసెంబర్ 24

ఈ ఏడాది భారతీయ స్టార్టప్‌లకు ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)లు కలిసొచ్చాయి. దీంతో చాలాకాలం తర్వాత మళ్లీ 2025లో స్టార్టప్‌లలోకి నిధులు పోటెత్తినట్టైంది. లెన్స్‌కార్ట్, గ్రో, మీషో, ఫిజిక్స్‌వాలా తదితర 18 స్టార్టప్‌లు దేశీయ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదయ్యాయి మరి. ఈ క్రమంలో రూ.41,000 కోట్లకుపైగా నిధులను ఈక్విటీ మార్కెట్ మదుపరుల నుంచి సమీకరించాయి. 2024లో రూ.29,000 కోట్లే. అయితే ఈ ఏడాది దేశీయ టెక్ స్టార్టప్‌లు 10.5 బిలియన్ డాలర్ల నిధులనే అందుకున్నాయి. గత ఏడాది 12.7 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.




2023లోనూ 11 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని మార్కెట్‌ను సమీక్షించిన ట్రాక్సన్ తెలిపింది. అలాగే 100 మిలియన్ డాలర్లకుపైగా ఉండే ఫండింగ్ రౌండ్లు 14కు పడిపోయాయి. గత ఏడాది 19 జరిగాయి. ఈ ఏడాది ఇరిషా ఈ మొబిలిటీ (1 బిలియన్ డాలర్లు), జెప్టో (450 మిలియన్ డాలర్లు), గ్రీన్‌లైన్ (275 మిలియన్ డాలర్లు) వంటి భారీ డీల్స్ ఉన్నా ఫలితం లేకపోయింది. '2025 బ్లాక్‌బస్టర్ ఐపీవోలకు నెలవైంది. వెంచర్ క్యాపిటల్ (వీసీ), ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) దన్ను కలిగిన కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు వచ్చాయి' అని ట్రాక్సన్ సహ వ్యవస్థాపకురాలు నేహా సింగ్ పీటీఐకి తెలిపారు.

## సఫారీల నేలపై టీ20 జాతర. రేపటి నుంచే నాలుగో సీజన్..!

ప్రపంచమంతా విస్తరించిన ఫ్రాంచైజీ క్రికెట్ లీగ్ సందడి రేపటితో దక్షిణాఫ్రికాలో మొదలవ్వనుంది. మూడు సీజన్లుగా అభిమానులను అరలిస్తున్న ఎస్ఏ20 నాలుగో ఎడిషన్ డిసెంబర్ 26 నుంచి షురూ కానుంది. ఐపీఎల్, బిగ్‌బాష్ లీగ్ తరహాలో క్రేజ్ సంపాదించుకున్న ఎస్ఏ20లో టైటిల్ కోసం ఆరు జట్లు పోటీపడనున్నాయి. దాదాపు నెలరోజులు ఉత్కంఠ పోరాటాలతో కొనసాగే ఈ టోర్నీలో విజేత ఎవరో జనవరి 25న జరిగే ఫైనల్‌తో తేలిపోనుంది. టీ20ల్లోని మజాను అభిమానులకు పంచేందుకు ఎస్ఏ20 సిద్ధమవుతోంది. అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాలుగో సీజన్ రేపటి నుంచే ప్రారంభమవుతుంది. తొలి పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ ఎంఐ కేప్‌టౌన్‌తో డర్బన్ సూపర్ జెయింట్స్ తలపడనుంది. డబుల్ రౌండ్ రాబిన్ పద్ధతిలో నాలుగు వారాల పాటు సందడిగా సాగే ఈ టోర్నీలో టాప్-4 జట్లు ప్లే ఆఫ్స్‌కు దూసుకెళ్తాయి. జనవరి 25న ఫైనల్‌తో ఈ లీగ్ ముగుస్తుంది. టోర్నీ ఆరంభానికి మరికొన్ని గంటలే ఉన్నందున గురువారం




లీగ్ కమిషనర్ గ్రేమ్ స్మిత్, జేపీ డుమినీ, డూప్లెసిస్, షాన్ పొలాక్, హాషీం ఆమ్లాలు ట్రోఫీని ఆవిష్కరించారు.

ముఖ్యమైన తేదీలు..

జనవరి 21 -క్వాలిఫయర్ 1 - టేబుల్ టాపర్స్ మధ్య.

జనవరి 22 - ఎలిమినేటర్ - మూడు, నాలుగో స్థానాల్లోని జట్ల మధ్య.

జనవరి 23 - క్వాలిఫయర్ 2- క్వాలిఫయర్ 1లో ఓడి.. ఎలిమినేటర్‌లో గెలిచిన జట్లు తలపడుతాయి.

జనవరి 25, ఫైనల్ -క్వాలిఫయర్ 1, క్వాలిఫయర్ 2 మధ్య జరుగుతుంది.

# స్పోర్ట్స్

## మ్యాచ్ విన్నర్ వచ్చేస్తున్నాడు

### న్యూజిలాండ్ సిరీస్‌తోనే పునరాగమనం..!



టీమిండియా మ్యాచ్ విన్నర్ శ్రేయస్ అయ్యర్ వచ్చేస్తున్నాడు. సిడ్నీ వన్డేలో గాయంతో రెండు నెలలకుపైగా ఆటకు దూరమైన అయ్యర్.. పునరాగమనం కోసం సిద్ధమవుతున్నాడు. స్వదేశంలో జరుగనున్న న్యూజిలాండ్ సిరీస్ స్క్వాడ్‌లో ఈ స్టార్ క్రికెటర్ ఉంటాడనే వార్తలు వినిపిస్తున్నాయి. అంతకంటే ముందు విజయ్ హజారే ట్రోఫీ లో అయ్యర్ ఆడుతాడని సమాచారం. ప్రస్తుతం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో ఫిట్‌నెస్ మెరుగుపరుచుకుంటున్న అతడు బ్యాటింగ్ సెషన్‌లో పాల్గొన్నాడు. గురువారం అయ్యర్ సాధన చేస్తున్న వీడియోలు బయటకొచ్చాయి. వన్డేల్లో కీలకమైన ఆటగాడిగా ఎదిగిన శ్రేయాస్ అయ్యర్ పునరాగమనం చేసేందుకు రెడీగా ఉన్నాడు. సర్జరీ అనంతరం వేగంగా కోలుకున్న భారత స్టార్.. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిపుణుల పర్యవేక్షణలో ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరవుతున్నాడు. దక్షిణాఫ్రికాతో మూడు వన్డేలకు దూరమైన అతడు.. వచ్చే ఏడాది న్యూజిలాండ్ సిరీస్‌కు అందుబాటులో ఉండే అవకాశముంది. సీఓఈ నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు సెలెక్టర్లు అయ్యర్ పేరును పరిశీలిస్తారు. కొత్త ఏడాది ఆరంభంలో కివీస్ టీమ్ వన్డే, టీ20 సిరీస్‌ల కోసం భారత్‌కు రానుంది. జనవరి 11న వడోదరలో తొలి వన్డేతో వైట్‌బాల్ సిరీస్ ప్రారంభం కానుంది.

**డైవ్ చేస్తూ గాయపడి**

వన్డేల్లో నాలుగో స్థానంలో స్థిరపడిన అయ్యర్ రెండేళ్ల క్రితం వన్డే వరల్డ్‌కప్‌లో, ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలో కీలకమయ్యాడు. వచ్చే ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా ఆస్ట్రేలియా పర్యటనకు జట్టుతో వెళ్లిన అయ్యర్ మూడో మ్యాచ్‌లో అనూహ్యంగా గాయపడ్డాడు. హర్షిత్ రానా ఓవర్లో అలెక్స్ క్యారీ కొట్టిన బంతిని అయ్యర్ డైవ్ చేస్తూ అందుకున్నాడు. సూపర్ క్యాచ్ పట్టిన అతడు.. ఆ తర్వాత నొప్పితో విలవిలలాడాడు. స్కానింగ్ పరీక్షల్లో ప్లీహం దెబ్బతిన్న విషయం బయటపడగా.. సిడ్నీలోనే ఆపరేషన్ చేయించుకున్న అయ్యర్.. అక్కడే కొన్నిరోజులు ఉండి కాంచెం కోలుకున్నాక స్వదేశం తిరిగొచ్చాడు. ఇంటివద్ద అల్ట్రాసోనోగ్రఫీ చేయించుకున్న భారత స్టార్ ఆరోగ్యాన్ని స్పోర్ట్స్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ దిన్షా పర్దివాలీ పరిశీలించి.. అతడు వేగంగా కోలుకుంటున్నాడని చెప్పాడు.

## చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లీ..

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ చరిత్ర సృష్టించాడు. లిస్ట్ ఏ క్రికెట్‌లో అత్యంత వేగంగా 16 వేల పరుగుల మైలురాయి అందుకున్న తొలి బ్యాటర్‌గా నిలిచాడు. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో బరిలోకి దిగిన విరాట్ కోహ్లీ.. బుధవారం బెంగళూరులోని బీసీసీఐ సెంట్రల్ ఆఫ్ ఎక్సెలెన్స్ మైదానం వేదికగా ఆంధ్ర జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌లో శతకంతో చెలరేగాడు. 101 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లతో 131 పరుగులు చేసాడు. ఈ మ్యాచ్ ద్వారా లిస్ట్-ఏ క్రికెట్‌లో కోహ్లీ 16 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఇప్పటి వరకు కోహ్లీ 343 లిస్ట్ ఏ మ్యాచ్‌ల్లో 16130 పరుగులు చేశాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో కోహ్లీ కంటే ముందు ఏడుగురు బ్యాటర్లు ఉన్నారు. భారత్ తరఫున 308 అంతర్జాతీయ వన్డేల్లో 53 శతకాలు, 76 హాఫ్ సెంచరీలతో సాయంతో 14,557 పరుగులు చేసిన కోహ్లీ.. ఢిల్లీ తరఫున 14 విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌ల్లో 5 శతకాలు, 3 హాఫ్



సెంచరీలతో సహా 950 పరుగులు చేశాడు. అయితే లిస్ట్-ఏ క్రికెట్‌లో ఇంగ్లండ్‌కు చెందిన గ్రాహం కూచ్ లిస్ట్ ఏ క్రికెట్‌లో టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. 1973-97 మధ్య అతను 613 మ్యాచ్‌లు ఆడి 22,211 పరుగులు చేశాడు. ఇంగ్లండ్‌కే చెందిన గ్రాహం హిక్ 651 మ్యాచ్‌ల్లో 22,059 పరుగులతో రెండో స్థానంలో నిలిచాడు. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ 1989-2012 మధ్య 551 లిస్ట్ ఏ మ్యాచ్‌ల్లో 21.999 పరుగులు చేశాడు. ఇందులో 18426 పరుగులు అంతర్జాతీయ వన్డేల్లో సాధించాడు. శ్రీలంక మాజీ కెప్టెన్ కుమార సంగక్కర 529 లిస్ట్ ఏ మ్యాచ్‌ల్లో 19,456 పరుగులు, విండీస్ బ్యాటర్ వివ్ రిచర్డ్స్ 1973-1993 మధ్య 500 లిస్ట్-ఏ మ్యాచ్‌ల్లో 16,995 పరుగులు, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ 456 లిస్ట్ ఏ మ్యాచ్‌ల్లో 16363 పరుగులు చేశాడు. వెస్టిండీస్‌కు చెందిన గోర్డాన్ గ్రీనిడ్జ్ 440 లిస్ట్ ఏ మ్యాచ్‌ల్లో 16349 పరుగులతో కోహ్లీ కంటే ముందున్నారు. గత ఐదు వన్డే మ్యాచ్‌ల్లో విరాట్ కోహ్లీకి ఇది మూడో శతకం కావడం గమనార్హం. లిస్ట్-ఏ క్రికెట్‌లో విరాట్ కోహ్లీ 330 ఇన్నింగ్స్‌ల్లో 58 శతకాలు నమోదు చేశాడు. సచిన్ 60 సెంచరీల రికార్డ్‌కు రెండు శతకాల దూరంలో నిలిచాడు. విరాట్ కోహ్లీ శతకంతో ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.